శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక.

కాకినాడ.

రెండు నెలల కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౨౫.	ధాతృనామసంవత్సరము. శ్రావణనిజభాద్రపదమాసములు.	సంచిక 3.

పొగడదండ

— వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు పిఠాపురము. —

ఈపదము శ్రీనాథుని చాటు వగు 'కవిరాజుకంఠంబు కౌఁగిలించెను గదా పురవీథి నెదురెండఁ బొగడదండ' యనుపద్యమునఁ గలదు. ఇద్యది పొగడదండ కాదు. పొరకదండ యై యుండును. అని బండారు తమ్మయ్య గారు 'శ్రీనాథకవిప్రయోగవిశేషములు' అను వ్యాసమున వ్రాసి యున్నారు.

పొగడదండ యనఁ బైని జూపినది గాదని నాయభిప్రాయము. 'పొగడదండ' ఇచట సవరించి పొరకదండ యనినను రామాభ్యుదయ ప్రథమాశ్వాసమునందలి—

"క. అలరువిలుకానితోఁ డెప్పుఁ
డెలమి న్నాపొగడదండ యి; న్నీవైతే
వలరాజునాన మీఱిన
వెలఁదీ నినుఁ బొగడదండ వేయింతుఁ జుమీ." 193

అనుపద్యమునఁ బొరకదండ (= గడ్డివెంటి) యనుట సరిపడదు. ఈపద్యమునఁ గూడఁ బొరకదండయే కాఁ గూడదా యనినచో యమకప్రచురమైన రామాభ్యుదయము స్వరూప మెఱుఁగనట్లగును.

శ్రీనాథునిపద్యమునఁ బొరకదండ మెట్లని యర్థమునఁ గుదిర్చినను నీకం దపద్యమున 'నిను బొరకదండ వేయింతు' ననుట యెట్లు? గడ్డివెంటిచే నిన్ను వేయింతు నని యర్థము చెప్పుట యనుచితము గదా! శ్రీనాథుని పద్యమునఁ 'గౌఁగిలింతు,' అను క్రియతో నన్వయము కావున నచటఁ బొసఁగినను 'నినుఁ బొగడదండ వేయింతు' ననుట కావునఁ బొసఁగక యున్నది. 'నీకుఁ బొగడదండఁ గట్టెదను' అని యుండవలయును. అట్లు లేక 'నినుఁ బొగడదండ వేయింతు' నని యుండుటవలనను, శ్రీనాథపద్య మునఁ దక్కిన మూఁడు పాదములందును నపరాధ మొనర్చువానికి వేయు శిక్షలే యుండుటవలనను, పొగడదండయు 'శిక్షింపుట కుపయుక్తమగు సాధనము' అయియుండును. ఈపొగడదండయొక్క స్వరూపమును గొలఁదిగా గ్రహింప ననువగునట్లుగా రామాభ్యుదయమునందే 8 వ యాశ్వాసమున, నింద్రజిత్తు గగనమునుండి యుద్ధముచేయుట వర్ణించునందర్భమున "సీ. మెడకు మీఁగాలికిఁ బుడమికిఁ గోన నేయుఁ బొగడదండల తోడఁ బొలియువారు"-16 పద్యమున నున్నది. ఆకాశమునుండి యింద్రజిత్తు భూమిపై నున్న వానరులను బాణములచేఁ గొట్టుచున్నాఁడు. ఒక బాణమే మెడకును మీఁగాలికిని గ్రుచ్చుకొని భూమిలో నాటుకొనిపోవుచున్న దఁట. అట్లు మెడకును మీఁగాలికిని గలిపి కట్టి పట్టుండుట 'పొగడదండ' యనుశిక్ష. వేసినట్లున్నది. అని భావము. దీనివలనఁ బొగడదండ యన నిగళయుగము వెదురుగోడియ, మున్నగు శిక్షాసాధనములలో నొకటి కాని యన్యము కా దనియు, మెడకును మీఁగాలికిని గదలకుండ నంటఁగట్టెడు త్రాడో, యినుపగొలుసో, మఱొకటియో యై యుండు ననియుఁ దెలియవచ్చుచున్నది.

సాహిత్యసంస్కారము.

—కాశీభట్ల కృష్ణరాయశాస్త్రిగారు, సాలూరు.—

సాహిత్యపరిషత్కార్యకలాపములలోఁ బండితజనులకుఁ దుష్టిపుట్టించుటయు నొకఁ డగుట నప్పని కెప్పుడి నెందఱేని నప్రయత్నులగుట యుచితమే. ఇందు సాహిత్యచర్చయును సంస్కారరూపమును నిరూపింపనిశ్చయించితిని.

సాహిత్యము, సహితభావము సాహిత్యమని తెలియఁబడుచున్నను బరికింప ననేకాకాంక్షాసాపేక్ష మయి మహాగంభీరాశయగర్భ మయినట్లు తోఁచును.

భాషామయము లైన దెల్లదియును సాహిత్య మనవలయును. వేద వేదాంగ తదితరసర్వవాఙ్మయప్రపంచము ను సాహిత్య మనవలయును. భాషాపాండిత్యము పరిమితమై పదపదార్థములను మాత్రము గ్రహింపఁ జాలును. సాహిత్యము పదపదార్థసమగ్రసారమును గ్రహింపఁజేయును.

సాహిత్యపదము వర్తమానకాలమునం దేయర్థ మిచ్చుచున్నదో యాయర్థము ప్రాచీనకాలము నుండియు నిచ్చుచున్నట్లు వాఙ్మయంబునఁ గానము. అయినను దద్భావవాచకమును వే ఱొకదాని నరయుదము. వేదము లతిప్రాచీనము లగుట నందు "సాహిత్య"శబ్ద మున్నదీ యేమో యన్న నందు లేదు. లేకున్నను గవిశబ్దముం గాంతుము కావునఁ గవిసామగ్రియగు సాహిత్యమును నుండి యుండవలయుటఁ దత్తదర్థబోధకపద జాల ముండితీఱును.

కవిః, వేదవిత్, ధీరః, ఆర్యః, మేధావీ, హోతా, ఉద్గాతా, ఇత్యాదిశబ్దములు విద్వత్పర్యాయములుగఁ గానవచ్చుటచే విద్వత్సాధ్య మగువిద్వత్త్వమును గల దని యనుకొనవలయును.

పురాణములయందుఁగూడ శ్రుతిసంపన్నుఁడు, వచనసంపన్నుఁడు, వ్యుత్పన్నుఁడు, పండితుఁడు, మున్నగు శబ్దములఁ గందుము. ధర్మశాస్త్రంబులను ధర్మవిదాది శబ్దములను గాంతుము. కాని, ప్రాచీనవాఙ్మయంబున

"సాహిత్యసంపన్నుఁడు, అనునట్టి పదమును గానము. అయినను ధర్మివాచకములను జూచి ధర్మవాచకము లున్న వని గ్రహించి సాహిత్యార దర్థవ చ్ఛబ్దము లున్న వని యనుకొనవలసినదే.

ఏది యెట్లున్నను గావ్యవాఙ్మయమును దద్వివేచనావాఙ్మయంబును బ్రాదుర్భవించిననాఁటినుండియు ను సాహిత్యశబ్దము సామాన్యపాండిత్యశబ్దార్థవిలక్షణార్థవైశిష్ట్యము గలది యగుచున్నది. నాఁడును నేఁడును గవికి ముఖ్యజ్ఞేయము సాహిత్య మనియును గావ్యపరిశీలనాసామర్థ్యమున కుత్తమసాధనమును సామగ్రియును సాహిత్యమనియును బెద్దలందురు. అట్టిభావము గలవా రగుటఁ బెద్దలు నాయాలక్షణగ్రంథములకు సాహిత్యమీమాంసాది నామములఁ బెట్టి కావ్యమాత్రోపయోగిచర్చ గావించిరి. జ్ఞానప్రకాశనావైదగ్ధి సాహిత్యమునం దుండుటచేఁ గొందఱు సంప్రయోగ మనియు వాడి రనుకొందును.

కొందఱు సాహిత్యశబ్దమును భోజనసామగ్రికి వ్యవహారములో వాడుదురు. అయినను సహితభావము సాహిత్య మనునర్థయోగమునకు భంగమురాకుండఁగనే వాడుచున్నారు. కనుక సంపదయే సాహిత్య మని యనుకొందము.

వాఙ్మయప్రపంచమున వాఙ్మయసంపదయే సాహిత్య మందము. ఈసాహిత్యస్వరూపిణియే సరస్వతి యని భావింత మన్న సరస్వతీవర్ణనాసందర్భమున "సంగీతమపిసాహిత్య"మ్మని చెప్పుసంగీతమును సాహిత్యాంగముగఁ దీసికొన్నట్లు భావింపవలసివచ్చును.

సాహిత్యము, సంగీతము.

సరస్వతీదేవి స్తనద్వయము సంగీతసాహిత్యాత్మకము. ఉత్తమసారస్వత మంతయు సంగీతసాహిత్యవిశిష్టము గాకున్న సరస్వత్యధిదేవతాకము గా దనవలయును. ఎల్లవాఙ్మయంబున నీరెండును నుండవలయు నన్నచో శాస్త్రాదులు సారస్వతవాచ్యములు గా వనవలసివచ్చును. రామాయణాది చ్ఛందోబద్ధగ్రంథములయందు సంగీతము గల దనియును సాహిత్య మున్న దనియును సారస్వత మగు ననియును నిర్ణయించుకొంద

మన్న దశకుమారచరిత్రాది వచనగ్రంథములు నిశ్ఛాందసము లగుటను సంగీతము లేమిని సారస్వతము లన వలను గాదు. శాస్త్రాదులమాట చెప్పనేల? సూత్రగ్రంథములును సరస్వత్యధిదేవతాకములు కావనవలయును. గీతగోవిందము త్యాగరాజకృతులు మున్నగునవియే సరస్వతీపూర్ణరూపారోపము లనవలసివచ్చును. కావున నా "సంగీత" శబ్దమునకు శ్రూయమాణార్థ మపార్థ మనియు ను రమణీయశబ్దతత్స్వరవైశిష్ట్యమే సంగీత మనియుఁ దదర్థసారమే సాహిత్య మనియు నర్థము చెప్పవలయును. నేఁ డనుకొను సంగీతము కేవలకృతకమును వినోదమాత్రనిర్వాహకమును, స్వరకలాపమాత్రైంద్రజాలికక్రియావిశేషమును నగు ననవలయును. తంత్రీలయసమన్వితముగఁ బరిమితస్వరమేళనావిశేషముఁ బలుకు శబ్దజాలము సంగీతము. రామాయణమును కుశలవులు గానము చేసిరనుటయు నట్టిసంగీతమనియే యర్థము. వేయేల? పొందిక యగుపలుకే సంగీతము. తదర్థములే సాహిత్యము. భావావేగమును బూర్ణాభినివేశముతోఁ దెలుపుపలుకే సంగీతము. ఇట్లర్థము చేసినచో నెల్లవాఙ్మయమును సంపూర్ణసరస్వతీసుందరారోపము నొందఁగలదు. మఱియును బూర్వుల కాయభిప్రాయ ముండుటచేతనే వేదాదులయందు స్వరవిశేషమును బ్రధానము చేసిరి. అదియే గాన మనియు నందు సామవేదము కేవలగానార్థ మనియు సామములు గానము చేయుట యనియు సంప్రదాయముగ ననుకొనుచున్నారు. కావున సంగీతసాహిత్యము లవినాభావములు. శబ్దార్థముల నిత్యసంబంధము నట్లు సంగీతసాహిత్యములు నిత్యసంబంధములు. ఆచదువులతల్లిపాలిండ్లపాలును నేకముఖపేయములు. కాకున్న నస్వభావము. ఆసంగీతమే శాబ్ది యనియు నాసాహిత్యమే యార్థి యనియు నయ్యెను.

వ్యాకరణశాస్త్రము సంగీతోద్భవము. మాహేశ్వరసూత్రము లట్టివే. చదువునప్పుఁ డొకస్వరమును నొకస్థాయియుఁ బలుకునప్పు డొకస్వరమును స్థాయియు భారతీయు లుపయోగించుట సహృదయు లెఱుంగుదురు. శాబ్దప్రమాణము సంగీతముపై నాధారపడియున్నది. అనఁగా

స్వరవైకల్యమునఁ వర్ణవైకల్యమును ననర్థప్రాప్తియుఁ గల దగుట సంగీతప్రాధాన్యము నెఱుంగవచ్చును. వక్తృవివక్షాధీనముగ శాబ్దమున్న దనుటయు సంగీతమే. ఆసంగీతసామంజస్యమే వైదికులకు స్వరసహితశబ్దముగను సూత్రకర్తలకు సూత్రములు ఛాందసములుగను పౌరాణికులకుశ్లోకముగను వైయాకరణులకు ననపశబ్దత్వముగను నాలంకారికులకు శబ్దాలంకారముగను మాఱినవి. సంగీతము సాహిత్యసహచరము.

సాహిత్యచర్చలు వేదములయందును గలవా? కావ్యాద్యవేక్షణమాత్రము సాహిత్యము గాదా? సాహిత్య మెఱింగిన సంగీత మెఱింగిన ట్లగునా?

సంగీతము సాహిత్యాంతఃపాతి యగుటను జర్చింపనక్కఱలేదు. సంగీతసాహిత్యము లేకున్నఁ బసువే యని భర్తృహరి యనెను. సాహిత్యము సమగ్ర మగునెడ సంగీతాదు లన్నియును విజ్ఞాతము లగును. మల్లినాథాదు లట్టిసాహిత్యవేత్తలే. వాఙ్మయంబున "సాహిత్యము" కావ్యాంగముగ నున్నను గవిమాత్రవేద్యముగ నున్నను వేదవేదాంగాద్యనంతరభావిత్వము సూచితమైనను తావన్మాత్రనిర్వాహకము సాహిత్యము గాదు.

కవిమాత్రవేద్యము సాహిత్య మనున ట్లాయాసాహిత్యగ్రంథము లున్నవి. కావ్యనిర్వాహకము ను దత్పరిశీలనాపరము ను నై సాహిత్యమున్నది. ఇఁక సాహిత్యవిషయప్రాధాన్యము మనమున నిడుకొని "అధికృతానధికృతయోః అధికృతప్రతిపత్తి ర్బలీయసీ" యనున్యాయమున నేదేదో యాగ్రహాభినివేశములతోఁ జెప్పవలసినదే కాని స్పష్టప్రతిపత్తిగఁ జెప్పుట కింతకు మించి లేదు. అయినను "సాహిత్య"శబ్ద పదర్థ తత్త్వార్థపర్యాలోచనాపర్యవసితముగ నితోధికము చెప్పకున్న విషయసమగ్రత్వభంగము వాటిల్లును. కావునఁ బునఃపున ర్విచారణీయ మగును.

విచారిత రమణీయమును వాఙ్మయప్రచుర నవనవోజ్జీవిత వికాసవిలాసమును నగుసాహిత్యవివేకము పురుషార్థము ననవచ్చును. ప్రాకరణికవిషయమును వేదానుబంధము గావించుటయు దర్శనాంతఃపాతిగావిం

చుటయుఁ బ్రాచీనకాలమునుండియు నాచార మగును. కావ్యమీమాం
సాకర్త "సాహిత్యవిద్య"ను వేదాంగముగఁ బరిగణించెను. వేదాంగత్వ
మున్నఁ బవిత్ర మని విశ్వాసము- అగుంగాక. వేదాంగత్వసిసాధయిష
విమర్శకచ్ఛాందస మని యధునాతనాంగ్లసాహిత్యవాసనావాసితమా
త్రచ్ఛాందసు లందురు. కాని వాదవిచక్షణు లెవ్వరేని వేదైకశరణ్యులు
గావలయును. ఆదిమధ్యాంతముల విభాగించుకొని వివేకించుట జిజ్ఞాసా
విధానము గాని పరమార్థజ్ఞానము గాదు. అట్లగుట నేవిషయమును
దత్త్వమున ననిర్వాచ్యనిర్వాణమునకు దారిచూపునదియే యగును. కా
వున సాహిత్యము వేదాంగముగ నెఱుంగవచ్చును. సాహిత్యేతిశబ్దము
శ్రూయమాణము గాకున్నను దదర్థవచ్ఛబ్దమామ్నాయంబున లేక
పోలేదు. సాహిత్యశబ్దశాబ్దీభావనామూలమున నే సాహిత్యశబ్దము నిష్ప
న్నమైనది. కావునసాహిత్య మవైదిక మనరాదు. మఱియును "సంవదధ్వం
సంవో మనాంసి, సమానీ సమితిః సమానీఆకూతిః" ఇత్యాదులగుఋగ్వే
దసూక్తములవలనను (యజుర్వేదమునను గలవు) నానామనస్సమీకరణ
ము నానాభిప్రాయసమీకరణమును గలదగుట సాహిత్యమున్న దనవల
యును. ఇంతకును వేదబ్రాహ్మణములు మంత్రభాగసమాలోచనాత్మకము
లనియు నందు సాహిత్యశాస్త్రసంప్రయోగము గలదనియు విజ్ఞులెఱుంగు
దురు. "ఆశ్వీవా బృహద్వయాః, శ్రీర్వై పిలిప్పిలా, రాత్రిర్వై పిశం
గిలః" ఇత్యాదులును ఇదంద్రో ఇంద్రః, చత్వారివాక్పరిమితా, యత్ప్రాత
రన్వబ్రవీత్ తత్ప్రాతరనువాకస్య ప్రాతరనువాకత్వమ్." 'సమస్య త్వేవో
త్తరేపదే' ఇత్యాదులవలన నానావిధశాస్త్రసాహిత్యసాహాయ్యవ్యాఖ్యా
నవైదగ్ధి సువిదిత మగుట లేదా; వ్యాకరణచ్ఛందోవైద్యాది శాస్త్రస
మన్వయమును వైదికవాఙ్మయంబునఁ గాంతుము. వేదములనుండి వచ్చి
నదనుటలో లోపము లేదు, కాని, శబ్దశక్తిప్రామాణ్యమును బట్టి కావ్యో
పయోగి యని యనవలయును. అట్లన్నను బంచమవేద మనఁబడుభార
తము కావ్యమనియుంటఁ గావ్యత్వము వేదాదులకుఁ గలదనవలయును.
"తర్కాలంకారశాబ్దానాం సంహతి స్సాహితీ" అనుటను శాస్త్రసముచ్చ
యమని యెఱుంగవలయును. సాహిత్యము పాండిత్యేతరమని యొకకవి

ర్ణించెను. “సాహిత్యపాండిత్యయోః” వ్యాఖ్యాతయును సాహిత్యము
కుఁ గావ్యాలంకారాది యనియును బాండిత్యమునకుఁ దర్కాదు లనియు
నెను. సాహితిశబ్దమున కొకఁడు పదార్థప్రవృత్తి యనెను. “సాహిత్య
ర్వస్త్రితద్వృత్తరంగా” అని శ్రీహర్షప్రయోగము. వ్యాఖ్యాత “మహాకా
వ్యనాటకచంపూప్రభృతినా” అనియనెను. మఱి యొకఁడు “కవిత్వేన”
అనిసాహిత్యమున కర్థము వ్రాసెను. ఇట్లు నానావిధములఁ బెద్ద లర్థము
చేసినను వానియం దేకత్వ మున్నది. అది వివిధశాస్త్రసాహిత్యమే.

వాక్ప్రపంచమున నిత్యవసంతోత్సవము సేయుచు వాగర్థకల్యా
ణవేదికపై నానాశాస్త్రముల నాస్తరించి శుభాశీర్వాదములఁ గావించు
నానాశాస్త్రసంశీతుల వక్తృజ్ఞానవైశిష్ట్యవ్యవహృత శబ్దశక్తిప్రభాశోభా
కందమే సాహిత్యము.

వివిధవిషయముల కుత్తేజమును వ్యక్తిత్వమును సాధికృతముగ
సంపాదించి సార్థక్యమును గూర్చునది సాహిత్యదివ్యశక్తి. వాఙ్మయవిశ్వ
ము నునికి గలతత్తత్ప్రాతిస్వికరూపవిశేషము సాహిత్యసంసర్గమువలనఁ
బ్రతిష్ఠిత మగుటచే నన్యశాస్త్రములయుఁ గావ్యములయు విద్యలయు
నన్యోన్యసామరస్యము సమంజసరీతి సంపాదించు నలౌకికశక్తి సాహి
త్యము. పదములకు వాక్యములకు నర్థవంతులకు ను దాత్త్వికులకును
గోచరమగు స్ఫోటమున సకలవాఙ్మయస్వరూపమునం దనిర్వాచ్య నిర
వయవ నిత్యసుందర లావణ్యవంతి స్ఫోటము సాహిత్యమునకు నైకాంతిక
లక్షణము. ధర్మిధర్ములకుఁ గార్యకారణములకు, ఘటఘటత్వములకు
శాస్త్రాదివేదులకుఁ దద్వేద్యమునకు వేదమునకుఁ దద్వేద్యునకు వాగర్థ
ములకు నవినాభావసంబంధసాతత్య ముఖ్యస్వభావము సాహిత్యము.

అనుభూయమానవిషయపరంపరాజస్రభూమి యావత్స్వరూపా
వగమకమంగళసాధనాసాధ్యసాధారణ్యవిన్యాసము సాహిత్య మగుట
నీసాహిత్యప్రభాసాన్నిధ్యమున సదసద్వాదేశ్వరసిద్ధాంతములును వైష్ణవ
బౌద్ధాదివ్యక్తివాదములును నణ్వాదిపదార్థవాదములు నాస్తికాస్తిక
హృదయములును బ్రకృతి పురుషప్రధానప్రస్తావములును శాబ్ద రసగు

ష్టాలంకారాది సారస్యాంగీకారములును జాతివ్యక్తిశక్తిభక్తిప్రకారకోక్తులును, సవిబోధప్రతిపత్తిసంపత్తికై నేకముఖముగావించి తత్తదైక్యవిధానాఖండానుభవప్రబోధము సుకరము సేయును

మద్ధర్మవదర్శినీతేజోరూపమును మహామంత్రవిద్యయు నై నిశ్చైతన్యము లగువానికిఁ జైతన్య మిచ్చి విద్యలకు శాస్త్రములకుఁ గలాప్రతిభనుగూర్చి తనసర్వవ్యాపకతాశక్తిఁ బ్రదర్శించు స్వయంశక్తి యీసాహిత్యము. వేదవేద్యప్రబోధకము వేదాంత మగునెడల వేదవేదాంగాదిసకలవిద్యాచాతుర్యైకస్థాన సుఖాసీన దివ్యరూపధ్యాన ముద్రాధర వేదాంతతత్త్వము సాహిత్యము. సమన్వయము సాహిత్యము. తదితరము తదితరము. "సహిత" భావము సాహిత్య మైనచో "సర్వ (వేదశాస్త్రకావ్యాది) హిత (అన్యోన్యావిరుద్ధసమన్వయమైన) తత్త్వము (సామరస్యనిర్ణయః)సహిత మనియుఁ దద్భావము సాహిత్యమనియు సంగ్రహముగ ననవచ్చును.

గ్రంథస్వీకారము

1. సీతాకళ్యాణము.

ఇది కొల్లాపురము స్నేహలతాకవితాసంఘాధ్యక్షులు వాజపేయయాజుల రామసుబ్బరాయుఁడు బి. ఏ. గారును వారిసోదరులు వేంకటనారాయణగారును రచియించిన మూఁడాశ్వాసముల పద్యకావ్యము కవిత నిర్దుష్టముగా నున్నది. గ్రాంథిక శైలి చక్కగా ననుసరింపఁబడినది. రచన మృదుమధురము. దీనిపై ననేకపండితులు తమతమ యభిప్రాయముల నిచ్చియున్నారు. అందఱును మెచ్చుకొనిరి. తొల్లిటిప్రబంధములలో వలెఁగొందఱనుసూచించినట్లు శృంగారాతిశయవర్ణనములుగాని వెర్రికల్పనలతోడి యతిమాత్రములగు నిరర్థకవర్ణనలు గాని లేకున్నను భరతఖండవర్ణనము హృద్యకల్పనతో నొప్పినను నధిక మేమో. చాతుర్వర్ణ్యవర్ణనము చర్వితచర్వణమేమో యనుకొందుము. చమత్కారముకొఱకుపీ రశయించి వ్రాసి రంద మనినను బూర్వులు నితరవిషయములను వారికి

చమత్కారముగ దోఁచియే వ్రాసి రని కొందఱయినఁ దలంతురు. చిన్ని రాత్రములోనిచట వర్ణనాతిశయమే తోఁపవచ్చును. అష్టాదశవర్ణనములు యుండవలయునను నియమ మున్న దని ప్రారంభమున వరుసపెట్టి పదునెని మిదిపద్యములుం జెప్పుటకంటె నాయాసందర్భములలో నాయావర్ణనలు చేయుట మంచిది. అది యిప్పటికి నెవ్వరుం బాటించుటలేదు. అందఱను మెప్పించువా రుండుట కష్టము.

రెండుమచ్చుపద్యములు-

ఉ. రణమేస్వర్గము మోక్షమందు నితరారంభంబుల న్నాని ధా
రుణిఁ గంపింపఁగఁ జేయుసైన్యముల నిస్త్రాలంబుఁ గావించి నీ
రనరవ్యాఘ్రములన్ వధించెడి మహోగ్రస్ఫూర్తితా మాస్తరన్
క్షణమాత్రంబున రంభఁ జేర్చిన ఘనుల్ జన్మించి రిందేకదా. 1-8

చ. చిరసఖుఁ డాజికిన్ విమలశీలుఁడు కాలుఁడు వైరిసేనకున్
బరమదయావిభూషణుఁడు పావనమూర్తి విశుద్ధకీర్తి సు
స్థిరమతి యంగదేశపతి జిష్ణుసమానుఁడు రోమపాదుఁ డా
వరనృపుఁ బిల్వ నన్యులను బంపక నీవ స్వయంబ యేగుమా. 2-16

ల్లాపురము స్నేహలతాకవితాసంఘములో దొరకును. వెల రు ౧.

2. సువర్ణకోశము.

గ్రంథకర్త శ్రీమాన్ శేట్లూరి వేంకటరాఘవ అయ్యంగారు, బి. ఏ, బి. ఇడి. బెజవాడ. శ్రీమదయ్యంగారు విద్యార్థిదశలోఁ జదివిన షెల్లీ, కౌపరు, బ్రౌనింగు, వర్డ్సువర్తు, ఆర్నాల్డు మున్నగు నాంగ్లేయ కవులు రచించిన పద్యమంజరులం బట్టి యాంధ్రమున 1 వలపు 2 కవిత 3 సంకీర్ణము 4 జీవము ననుభాగములుగా 92 చిన్నచిన్న పద్యమంజరులుగ రచించిన సువర్ణకోశము. అన్నియుఁ దేటగీతమాలికలు. కవిత్వము చక్కగా, ధారాళముగ నడచుచున్నది గాని యక్షరగౌరవమును బాటింపలేదు. కార్యాంతరనిమగ్నుఁడనగుటం జేసి, అర్ధానుస్వార శేఫశకట రేఫలను వ్యాకరణసంధిదోషములను అచ్చుపొరపాట్లను సవరింపఁజాలనైతిని. ...ముందుముద్రణమున దిద్దుకొందునని తెల్పిరి. మచ్చుపద్యములు-

కవిత-పుట 36.

బావిలో జల ప్రవహించు భాతిగాక
వృక్షశాఖలు చిగిరించు విధముగాక
మల్లెజాతులు వికసించుమాడ్కి గాక
కయిసేసల్లెడి శ్రమలోన గలుగుసౌఖ్య
మెఱుగువారలు కవులుగా కెవరు గలరు ?

కవిత్రయము పుట 42.

ప్రతిభ లేని కవీశ్వరువాక్యసమితి
ప్రకృతివైచిత్రి ప్రతిభా ప్రభావములను
గాని తక్కొంట కృతినేర్పు గానఁబడను
అతివసర్వాంగసౌష్టవ మందెగాని
ముక్కు మొగమున గనలేను చక్కదనము.

వెల తెలుపఁబడియుండ లేదు-

3. చెన్నబసవపురాణము.

ఇది యొక్క వచనకావ్యము. రాజమహేంద్రవరము శ్రీశైవగ్రంథ మండలి ప్రథమగ్రంథము. గ్రంథకర్త అన్నదేవర నాగభూషణముగారు ప్రకాశకులు శ్రీ. పీ. మ. స్వ. కాళహస్తి తమ్మారావుదేవరగారు. ఇది వఱకుఁ జెన్నబసవపురాణము పూర్వకవిరచిత పద్యకావ్యము గలదు, దాని కిది వచనము. శివభక్తుల కథలు మాహాత్మ్యములు పెక్కులుగలవు. మొదట విభూతిమహిమ, రుద్రాక్షమహిమ, పంచాక్షరీమహిమ, గురు ప్రసాదప్రశంస మొదలైనవికలవు. తరువాత శివభక్తాగ్రేసరుల ప్రభావములు కలవు. వచనరచన మంచిది. వ్రాఁతపొరపాట్లందందుఁ గలవు. మిక్కిలి నలఁగిపోయిన యక్షరములతోఁ గూర్పఁబడినయచ్చు. కొందఱకు సుఖముగాఁ జదువుకొనుటకు సాయపడదు. ఇందైదు ప్రకరణములు 44 విషయములు శైవారాధకులయుఁ దన్మహిమలయు వర్ణనములు గలవు. నిజాంరాష్ట్రములోని యాంధ్రసోదరుల సౌకర్యమునకు-సికింద్రాబాదులో మహంకాళిపేఠిలో కొండా శంకరయ్యగారిబుక్కుడిపోలోఁగూడ గ్రంథములు విక్రయింపఁబడును. వెల రు 1.

4. శ్రీసత్యనారాయణవ్రతచరిత్రము.

శ్రీమద్గద్వాలాస్థానకవియును, కవిసింహబిరుదాంకితులును నగు రా. రా. పోకూరి కాశీపతిగారు రచించినది. రాయచూరినివాసులు త్వకర్మకులోద్భవులు ఆత్మకూరి ముత్యాలయాచారిగారికిఁ గృతి. ఇందు సత్యనారాయణవ్రతవిధాన మున్నది. వ్రతకథకుఁ బూర్ణముగ, 5 శ్వాసములు పద్యములు రచింపఁబడినవి.

చ్చుపద్యము:—

విమలుని చంద్రకేతునృపవీరుని వీక్షించి నావనెక్కి ధా
మమునకు వైశ్యుఁ డేగునెడ మాధవుఁ డింపలరన్ ద్రిదండివే
షమును ధరించి వీరలకు జ్ఞానము వచ్చెనో లేదొ నేఁడు వే
గమ కనుఁగొందుఁ గం చెనుకుగాఁ జని బేరులతోడ నిట్లనెన్.

దీనివెల రు 0-4-0 వలయువారికి రాయచూరులో శ్రీరాధాకృష్ణముద్రశాలలో దొరకును.

5. అలంకారమంజరి.

గ్రంథకర్త శ్రీ. వేం. రాఘవఅయ్యంగారు, ఎమ్. ఏ., బెజవాడ.

సంస్కృతాలంకారప్రపంచమున మునిత్రయ మని ప్రఖ్యాతిఁ ందిన మమ్మటాచార్యుని కావ్యప్రకాశమునందలి కారికలను సూత్రప్రాయములుగ ననువదించి వృత్తిని వివరించి లక్ష్యపద్యముల రచియించి లక్ష్యలక్షణములకు సమన్వయ మొనరించి శ్రీరాఘవఅయ్యంగా రలంకారమంజరిఁ గూర్చి యాంధ్రవిమర్శకవాఙ్మయమునకు నొకనూతనాలంకారము సమకూర్చినారు.

సంస్కృతాలంకారశాస్త్రగ్రంథములకుఁ గేవలానువాదములు గాక నిష్టవివరణగ్రంథము లున్ననే యవి విద్యార్థిలోకమునకును, విమర్శలోకమునకు నుపకరించును. ప్రకృతగ్రంథమున రాఘవఅయ్యంగారు మమ్మటాచార్యమతమే గాక నితరాలంకారికమతములను గూడ సూచించుట మిగులఁ బ్రశంసనీయము. అలంకారమంజరియందు,తొమ్మిదిసుమము లున్నవి. (1) కావ్యభేదములు (2) శబ్దభేదములు, వృత్తులు వ్యాపారములు, (3) వ్యంగ్యము (4) ధ్వనిభేదము (5) రసస్వరూపము రసధ్వని

(6) గుణీభూతవ్యంగ్యములు (7) శబ్దాలంకారములు (8) గుణరీతులు, (9) అర్థాలంకారములు. ఇవిగాక యనుబంధమున శబ్దరసవిషయమై లొల్లట శ్రీశంకుక భట్టనాయక అభినవగుప్తపాదాచార్యరసమతవిచార వివరణము గలదు. పైవిషయసూచికచే నీగ్రంథ మలంకారశాస్త్రప్రవృత్తి నభిలషించువారల కెంత యుపయోగకరమో తెలియకపోదు.

రసనిష్పత్తి, రసనిరూపణమును గూర్చి శ్రీరాఘవ అయ్యంగారు ప్రాచీనాలంకారికమతసిద్ధాంతము లిందుఁ జర్చించియున్నారు. అయ్యది సహృదయైకవేద్యము- శృంగారాదినవరసములఁ గూర్చి స్థాయిభావములఁ గూర్చి యింకను వివరణము గలిగినచో నది యీగ్రంథప్రాశస్త్యమును మఱియుఁ బెంపొందించును. అలంకారశాస్త్రము రాఘవయ్యంగారు తొలిపలుకునఁ దొలిని నుడివినట్లు 'అపారము అగాధము' అయినను వారు కావ్యప్రకాశము నాధారముగాఁ గొని గ్రంథము రచియించుట చేతను నితరమతములవారినిఁ గూడ దిఙ్మాత్రముగఁ జర్చించుటచేతను నీ విషయ మావశ్యకమైనది. ఇట్టిపట్టు లీగ్రంథమునందలి రెంటినిఁ జూపుచున్నాఁడను.

పంచమకుసుమము 71 పుట. స్థాయిభావములవివరణము- 'ఆలుమగల కొండొరులపై నంటియుండువలపు నాఁబడు మనమునందలి మక్కువనే 'రతి' యందురు- గ్రంథకర్తగారి తెలుఁగుపలుకుబడి మెచ్చఁదగినదియేగాని శాస్త్రీయసాంకేతికపదవివరణమునందుఁ దెలుఁగుపలుకుబడి (మనకాయాశాస్త్రసాంకేతికములకుఁ దెలుఁగుపదములు తెలియువఱకు) యంత ప్రయోజనకారి కానేరదు. రతి యనునది ప్రేమ మని ప్రీతియని చెప్పఁబడు నొకచిత్తవృత్తియే "తత్ర స్త్రీపుంసయో రన్యోన్యాలంబనః ప్రేమాఖ్యశ్చిత్తవృత్తి విశేషో రతిః స్థాయిభావః" ఇయ్యది కేవలస్త్రీపురుషుల కన్యోన్యవిషయికమై నపుడు శృంగారస్థాయిభావ మగును.

గురుదేవతాపుత్రాద్యాలంబనస్తు వ్యభిచారీ- గురుదేవతాపుత్రాద్యాలంబనమైన ప్రేమ (రతి) వ్యభిచారిభావ మగును. ఇచ్చట నితరేతరాలంబనము ప్రధానముగా నెన్నఁదగియున్నది. ఇట్టిరతిభావమును రెం

డువిధములుగఁ జెప్పుటకన్న రతియంతయుఁ బ్రేమయని చెప్పుట నవీనా లంకారికసిద్ధాంత మని సుప్రసిద్ధాంధ్రదేశీయాలంకారికుఁడు వక్కాణించి నాఁడు. ఈస్థాయిభావమునుగూర్చి సూత్రించుపట్ల "స్త్రీపుంసయోః" 'యూనోః' రిత్యాదిశబ్దములనే యలంకారికు లుపయోగించియున్నారు. అట్టియెడ 'ఆలుమగ'లను పదము స్త్రీపురుషవాచకపరమైనను పైశబ్దా ర్థములను ధ్వనింపఁజేయుట లేదు. కావ్యప్రకాశమున రతికి 'అన్యోన్యా స్థాబంధాత్మికా రతిః' అని మాణిక్యచంద్రుని సంకేతటీక. కావ్యప్రకాశ మున రసలక్ష్యములు చెప్పఁబడినవి గాని స్థాయిలక్ష్యములు వేఱుగఁ జెప్పఁబడి యుండలేదు. తరువాతి యలంకారగ్రంథములయం దావివరణ ము గలదు.

నవమసుమము- పుట 238. వ్యతిరేకాలంకారము.

మలినతఁ గోశనిమగ్నత
ములుచన దృఢతలనిబద్ధముష్టిగుణములన్
దలపన్ గృపాణకృపణుల
కిలలో నాకారభేదమే గలదనుచున్.

ఇయ్యది-శ్లో. దృఢతరనిబద్ధముష్టేః కోశనిషణ్ణస్య సహజమలినస్య
కృపణస్య కృపాణస్య చ- కేవల మాకారతో భేదః.

ఇచట కృపణకృపాణములకు నాకారమున మాత్రమే- అనఁగా- ఆకృతివలన-కాదేని, ఆయనువర్ణమున నే భేద మని యభిప్రాయము-ఇం దుపమేయ మగుకృపణుని యం దుపమానమగు కృపాణము కంటె న్యూ నాధిక్యములు లేవు. ఉపమానము కంటె నుపమేయ మాధిక్యమును వహించిన వ్యతిరేకాలంకార మని కావ్యప్రకాశకారుఁడు. ఈలక్ష్యమున నిట్టియాధిక్యము లే దనుదోషము నప్పయదీక్షితులవారు కువలయానం దమునఁ జూపిరి. ఇట్టిరీతి చర్చల నాయాపట్టులఁ జూపిన గ్రంథకర్తగారిపరి శ్రమ మింకనుఁ దెలుపుఁగాగలను.

ఇందలి లక్ష్యశ్లోకములకుఁ బద్యములు హృద్యములై యున్నవి. గ్రంథకర్తగా రింకను సులభవివరణమున నాలంకారికవిషయుక గ్రంథముల

రచియించెదరుగాక. పాఠశాలోపయోగ మగు నీగ్రంథమును విద్యాశాలాసంస్థాపకు లాదరించెదరుగాక. (ని. వేం.)

గ్రంథము వెల రు 3. ఫెదర్ వైట్ గ్లేజు రు 2. రఫ్ రు 1.

6. శ్రీశుకనాసోపదేశము, శ్రీగురుదక్షిణ.

మదనపల్లెకాలేజీలో నాంధ్రభాషోపన్యాసకులును దేశభాషాపర్యవేక్షకులునగు బ్ర॥ విద్వాన్ దర్భా వేంకటకృష్ణమూర్తి ఎం.ఏ.గారిచే రచియింపఁబడి మాకార్యాలయమునకు భాషాభిమానముతోఁ గవిగారి చేతనే పంపఁబడినది.

ఇందు శుకనాసోపదేశము 134 వివిధపద్యములతోడి యేకాశ్వాసము. బాణకృతకాదంబరి దీనికి మూలము. అందు శుకనాసుఁ డను భూసురుఁడు, తారాపీడునకు బహిఃప్రాణమును మంత్రియు. తారాపీడుని కుమారుఁడు చంద్రాపీడుఁడు. ఆచంద్రాపీడునకు యౌవరాజ్యపట్టాభిషేకసమయమున శుకనాసుఁ డుపదేశించిన నీతి. మూలమునందలి యభిప్రాయము తెలుఁగులో నిపుణముగ నుచితరీతినిఁ దెనిఁగించిన కవిగారిం గొనియాడఁదగును. ఈచిన్నిపొత్తమునకై మూలము నిటఁజూపుట గ్రంథవిస్తరము. వేత్తలు గ్రహింతురుగాక.

సీ. మాలిన్య మెల్లఁ బ్రక్షాళింపఁజాలి యంధస్సువం జేయని మజ్జనంబు
జరయును నాదల నరయుట లోనైన వైరూప్యములు లేని వార్ధకంబు
బంగారునం గాని రంగారుశ్రుతిభూష మెదటిదోషము లేని మేటిగురుత
జ్యోతి కలితమా జ్యోతియు నుద్వేగ కరముగానట్టి జాగరము కరము
గురుని యుపదేశ మేమనుకొంటి వాక్య, నరుల కందును గరము భూవరుల కెందుఁ
దాదృశహితోపదేశంబు తప్పదెపుడు, విజయనగరనృపభూజానితనయవర్య. 45

సీ. అభిషేకమప్పుడే యడఁగు దాక్షిణ్యంబు కలశోదకములఁ బ్రక్షాళిత మన
స్స్వాంతంబు మలినతాక్రాంతమా హోమాగ్ని కార్శ్యమానంబు దాఁ గప్పె ననఁగఁ
బాలిమిసర్వంబుఁ దూలఁ బురోహితదర్భాగ్రసమ్మార్జితం బనంగ
మున్ముందుఁ బ్రాప్తించు ముదిమియక్షా స్మరణంబు తలఁగు నుష్ణీషబంధమున ననఁగఁ
బరలోకదర్శనప్రాప్తి దూరంబగు ఛత్రమండలసమాచ్ఛాదితత మన

సత్యసంధత్వంబు సంపూర్ణముగ మాయెఁ జామరపవమానసంహృతి మన
హితవాక్యులవితిరస్కృతములౌ జయజయ కలకలధ్వనులకుఁ గలఁగె మనఁగ
వేత్రదండములకు భీతిచేతనో నాఁగ, సద్గుణములు దవుల సాగిపోవ
ధ్వజపటాంచలముల గజిబిజి నన మలీ, మసత నెసఁగు నృపులయశము తండ్రి. 86

ఆంధ్రదేశభాషాపర్యవేక్షకులు నాచార్యపట్టాభిశోభితులు పెక్కురిక్కాలమునఁ గలరు గాని వీరికున్న యాంధ్రభాషాభిమానము వారికింతయు లేదనుట నిక్కము. ప్రమాదము లెవ్వరికైన నుండును. ఓపికగొలఁది నిక్కమైన మాతృభాషాసేవకులు వన్నెకెక్కుదురు.

ఇందలి రెండవది గురుదక్షిణ- ఇది చిన్న పూర్వకథ. ఉత్తమకులుఁడై గ్రహచారవశమున నన్నిటం జెడి యసత్యస్త్రీయా వలం దిరిగి చెడియు సద్గురూపదేశమున యసత్యమును గురుదక్షిణగా నిచ్చి బాగుపడిన యొక్క పురుషుని చరితము. 52 కందపద్యములు. పైయుపదేశము నందువలెనే యీగురుదక్షిణయందును కవిత్వము నాతికఠినమై నిర్దుష్టముగ నలరారుచున్నది. ఉభయభాషాపదప్రయోగము చక్కగా నున్నది. ఈకథయే, వివిధపద్యములలో 'భారతి' తొమ్మిదవసంపుటమున రెండవభాగములో "దస్యుఁడు- సదస్యుఁడు" ననునామమునం గలదు. మచ్చుపద్యములు.

క. అంతట నాభూవిభుఁ డో
మంత్రీ నీవేఁగి యిపుడ మనభవనమునం
దంతటఁ గనిరమ్ము హరీ
క్షింతు మిదే వీనిమాట యెంతనిజంబో. 29

క. అమ్మకచెల్ల నినుఁ జేటి
నమ్మితి నిందనుక నెమ్మనమ్మున నీదా
ట్లమ్మెల్లఁ దెలిసె గృహస
ర్వమ్ముడిగి మ్మైతి గదర ! పరమద్రోహీ ! 34

ఈగ్రంథమునకు వెల రు 0-8-0 కవిగారియొద్దనే దొరకును.

భాసుఁడు.

(") భాసకాళిదాసులు.

5. హృదయే నేహ తత్రాజ్ఞః ద్విధాభూతేవ గచ్ఛతి - బాలచరిత-1-13

ద్విధావిభక్తం ఖలు మేశరీరమ్- అవిమా-4-పు 70

గచ్ఛతి పురః శరీరం ధావతి పశ్చా దసంస్తుతం చేతః-శాకుం-1-30

6. పుష్పితానాం నగానాం షడ్భాగగ్రహణ మస్మాకం ధర్మః-తస్మా దస్మ
ణ్ణాన్ వృక్షాన్ కరిష్యావః-అవిమా- 4 అం-పు 62

నీవారషష్ఠభాగ మస్మాక ముపహరం త్వితి- శాకుం. అంక. 2

ఆర్యస్య వచనే నాస్మణే దానీ మేషా. 1 అంక.

7. ఆపృచ్ఛ పుత్రకృతకాన్ హరిణాన్ ద్రుమాంశ్చ
విన్ధ్యం వనం తవ సఖీ ర్దయితా లతాశ్చ- ప్రతిమా-5-11

యస్యోపాంతే కృతకతనయః కాంతయా వర్ధితో మే-మేఘ -2-14

శాకుంతలమున శకుంతల యాశ్రమోపాంతవృక్షముల సెలవుగై కొనినటుల వర్ణింపఁబడినది.

భోభోః సన్నిహితదేవతా స్తపోవనతరవః-

'పాతుం న ప్రథమం వ్యవస్యతి జలం...' అంక 4-8

ముంచం త్యశ్రూణీవ వనలతాః 4.11

జహాతి సోయం న పుత్రకృతకః పదవీం మృగస్తే 4-13

8. అపూర్వమలభ్యతేస్య సప్తపర్ణస్యాథస్తాత్ శుక్లవాససం భరతం దృష్ట్వా
పరిత్రస్తం మృగయూథ మాసీత్- ప్రతిమా. అంక-7

శాకుంతలనాటకమునఁ బంచమాంకమున శకుంతలావచనమును గనుఁడు. పరిచయరహిత మగు జనము నెడల మృగము లెట్లు చరించునో కాళిదాసుఁడు చక్కగ వర్ణించి భాసునిభావమునకు వన్నె పెట్టియున్నాఁడు. (శాకుం) తత్క్షణేన మే పుత్రకృతకో దీర్ఘాపాఙ్గో నామ మృగపోతక ఉపస్థితః త్వయాయం తావత్ ప్రథమం పిబ త్విత్యనుకంపినోపచ్ఛందిత ఉదకేన నపునస్తే పరిచయాత్ హస్తాభ్యాస ముపగతః పశ్చా త్తస్మిన్నేవ మయా గృహీతే సలిలేఽనేన కృతః ప్రణయః.

. కాలక్రమేణ జగతః పరివర్తమానా
చక్రారపంక్తి రివ గచ్ఛతి భాగ్యపంక్తిః- స్వప్న-అంక-1
నీచైర్గచ్ఛ త్యుపరి చ దశా చక్రనేమిక్రమేణ- మేఘ- 2 -49
. రేణుస్సముత్పతతి లోధ్రసమానగౌరః
సంప్రాప్నుతోతి చ దిశః పవనావధూతః ప్రతిమా-7-4
విరక్తసంధ్యాకపిశం పురస్తాత్
యతో రజః పార్థివ ముజ్జిహీతే- రఘు-13.64
. త మాపతంతం సహసా సమీక్ష్య- బాలచరి-5-2
తమాపతంతం నృపతే రవధ్యో- రఘు 5-50
. ఇషుమాత్రోదితే సూర్యే- ప్రతిజ్ఞా-అంక-1
యుగమాత్రోదితే సూర్యే- శాకుం-
. కన్యాయాః వరసంపత్తిః పితుః ప్రయత్నః భాగ్యేషు శేష మాయ
త్తం దృష్టపూర్వం న చాన్యథా ప్రతిజ్ఞా-అంక-2.5
భాగ్యాయత్త మతఃపరం నఖలు త ద్వాచ్యం- శాకుం-4-16
. ఏత దర్శకమ్-అహ మాత్మనః ప్రభవామి-అవిమా-అంక-3 పు.38
య ద్యాత్మనః ప్రభవిష్యామి- శాకుం. అంక-1
. స్వప్నవాసవదత్తమున (అంక-1) తాపసీపద్మావతుల ప్రసంగము-
తాపసీ—చిరంజీవ-ప్రవిశ-జాతే ప్రవిశ-తపోవనానినా మాతిథి
స్య స్వగేహమ్.
పద్మా—భవతు-భవతు-ఆర్యే విశ్వస్తాస్మి- అనేన బహుమాన
వచనే నానుగృహీతాస్మి.
శాకుంతలమునందలి (అంక-1)రాజా—భవతు భవతీనాం సూ
నృతయైవ గిరా కృత మాతిథ్యమ్. అను దుష్యంతుని వాక్యము
నుబోలి యున్నది.
. మఱియు స్వప్ననాటకమున నాశ్రమవాసుల నుత్సారణ మొన
ర్పరాదను కాంచుకీయునివాక్యమును, దుష్యంతుఁడు సేనాపతిని
వెనుకకు మరల నాజ్ఞాపించుచుఁ బల్కినమాటలును సమానా
ర్థకములు-

కాంచుకీ—నఖలు నఖ లూత్సారణా కార్యా। పశ్య
పరిహరతు భవా౯ నృపాపవాదం
నపరుష మాశ్రమవాసిషు ప్రయోజ్యమ్
నగరపరిభవాన్ విమోక్తు మేతే
వన మభిగమ్య మనస్వినో వసంతి- స్వప్న-1-5
దుష్యం—యథా న మే సైనికా స్తపోవన ముపరుంధంతి తథా
నిషేద్ధవ్యాః-
శమప్రధానేషు తపోవనేషు గూఢం హి దాహాత్మక మస్తి తేజః
స్పర్శానుకూలా ఇవ సూర్యకాంతా స్తదన్యతేజోఽభిభవా ద్వమంతి.
శాకుంతలీయశ్లోకమున నాశ్రమవాసులయందు గూఢ మగు తేజస్సు గల దనియు నది దాహాత్మక మనియు, నన్యతేజోఽభిభవమున వెడలఁగ్రక్కఁబడు ననియుఁ జేర్పఁబడినది.

17. సురద్విపాస్ఫాలనకర్కశాంగుళిః
మయాక్కృతార్థః ఖలు పాకశాసనః- కర్ణభార-శ్లో-2
సురద్విపాస్ఫాలనకర్కశాంగుళౌ- రఘు-3-5

18. స్వప్నవాసవదత్తమున నవిధవాకరణ, సపత్నీమర్దనము లను మూలిక లున్నట్లుల శాకుంతలమున నపరాజిత యను మూలికయు (అంక. 7) వర్ణింపఁబడినది.

19. స్వప్నవాసవదత్తము- (అంక-2)
పద్మావతీ—ఆర్యే-కి మిదానీం మా మపహసితు మివ నిధ్యాయసి
వాస—నహి నహి-హలా అధిక మద్య శోభతే అభిత ఇవ తే వరముఖం పశ్యామి.
పద్మా—అపేహి-మేదానీం మా మపహస.
ఈసంభాషణము శాకుంతలమునందలి ప్రియంవదా వాక్యము 'యథావనజ్యోత్స్న......' అను దానినిఁ దలపించుచున్నది.

20. వత్సరాజునకు వాసవదత్తయందలి ప్రేమ నష్టమయిన ఘోషవతీ వీణ లభింప నెట్లు వృద్ధి నొందెనో యట్లే దుష్యంతుని ప్రేమ అంగుళీయకపునర్దర్శనమున నభివృద్ధిని గాంచినది. ఈసందర్భమ

స్వప్ననాటకమున (6-1) 'శ్రుతిసుఖనినదే' అనుశ్లోకమును శాకుంతలమున (6-11) 'తవసుచరిత మంగుళీయ' మను శ్లోకమును జూడుఁడు. వీనియందే వీణాంగుళీయకముల యుపాలంభనము గలదు.

పైవిషయములవలన భాసునిభావములఁ గొని కాళిదాసుఁడు చమత్కారముగ నెట్లు చక్కనిశ్లోకముల రచించియున్నాఁడో స్పష్టముగదా. భాసునిశ్లోకము లనావిద్ధరత్నములవంటివి, కాళిదాసునివో సానలదీరిన జాతిరత్నములు.

రత్నావళీనాగానందప్రియదర్శికలను రచించిన హర్షవర్ధనుఁడును భాసకాళిదాసుల నాధారముగఁ గొని తననాటకముల రచియించెను. రత్నావళీప్రియదర్శికలయందు వత్సరాజచరితమే యితివృత్తము. వాసవదత్త యగ్నిలో దహింపఁబడె ననుకల్పితగాథ ననుసరించి రత్నావళియందు నైంద్రజాలికమాయచే రాజప్రాసాదము దగ్ధమయ్యె నని కవి కల్పించియున్నాఁడు. రత్నావళిలోని 'పరిమ్లానం పీనస్తన'... 'బాష్పాంబుచ' అను శ్లోకములు 'శయ్యానావనతా (5-4)' 'కామేనోజ్ఝమసి (4-1)' అను స్వప్నవాసవదత్తశ్లోకములను బోలియున్నవి. పూర్వోదాహృత విషయములవలన భాసుఁ డశ్వఘోషుని కర్వాచీనుఁ డనియుఁ గాళిదాస హర్షవర్ధనులకుఁ బూర్వుఁ డనియుఁ, గాళిదాసాదు లాతని ననుకరించిరనియు స్పష్టము.

— (8). చారుదత్తమృచ్ఛకటికములు —

ఇంతవఱకును మనము తిరువనంతపురనాటకములలోఁ జారుదత్తము నొకటిగ నెంచియున్నాము. నాటకము లన్నియు నేకకర్తృకము లని చూపించునపుడు చారుదత్తములోని శ్లోకములకుఁ బోలిక లితరనాటకములఁ జూపఁబడినవి. కాని చారుదత్తనాటకము మనకు సంపూర్ణముగ లభించి యుండ లేదు. మొకటి నాలు గంకములు మాత్రమే కలవు. ఒక ప్రాఁతప్రతియందు నాలుగవయంకము చివరను 'చారుదత్త మవసితమ్'ని యుఁ గలదు. ఇందు మనము ప్రథమమున విమర్శింపఁదగిన విషయములు రెండు గాననగును. చారుదత్త మసంపూర్ణ మగునాటకమా? నాలుగంకములతో సంపూర్ణత నొందినదా? యనునది యొకటి-రెండ

వని శూద్రకవిరచిత మగు మృచ్ఛకటికమునకును దీనికిని గలసంబంధ మేమి? చారుదత్తము స్వతంత్రనాటకమా? లేక మృచ్ఛకటికము నటకులచే మార్పఁబడి యిట్టిస్వరూపమును జెందెనా?

(a) చారుదత్త మసంపూర్ణ మగునాటకమే యనఁదగును. అందులకు వలయు నుపపత్తు లిటఁ గొన్నింటిని మాత్రమే చూపితిని. సుక్తంకరుగారు విపులముగ నీవిషయమును జర్చించి యిట్లే సిద్ధాంతీకరించిరి.[1]

(1) చారుదత్తనాటకమున మంగళశ్లోకభరతవాక్యములు లేవు.

(2) వసంతసేనాచారుదత్తుల ప్రణయ మెట్లు వృద్ధినొందెనో చారుదత్తమునఁ దెలియుట లేదు. దాని కెట్టి ప్రతిబంధకములు వాటిల్లెనవి? పర్యవసాన మేమి? కథాభాగమున ముఖ్య మగు వసంతసేనాచారుదత్తుల సమాగమమును గవి వర్ణింపకుండునా? అది లేనిచో నాటకప్రయోజనము గానరాకపోవుటయే గాక వస్త్వైక్యము గూడ సిద్ధించుట లేదు.

(3) ప్రథమాంకమునఁ జారుదత్తుఁడు దారిద్ర్యమును వర్ణింపుచు 'పాపం కర్మ చ యత్ పరై రపి కృతం తత్తస్య సంభావ్యతే'-చారు-1-6 అనును- ఏపాపకర్మ మాతని కంటఁగట్టఁబడిన దను విషయము చారుదత్తమున విశదీకరింపఁబడ లేదు. ఇందులకు గణపతిశాస్త్రిగారు వ్యాఖ్యాన మొనర్చుచు 'ఏతేన చారుదత్తేఽర్పితస్యా లంకారన్యాసస్య చౌర్య మస్య కృతం చారుదత్తకృత మితి శంకయా ప్రవృత్తో వధహేతు రభియోగ ఇతి వృత్తగతః సూచ్యతే'-అని వ్రాసియున్నారు. తత్కథ చారుదత్తమున లేదు.

(4) చారుదత్తము- 4-7 సజ్జలకః—

నరః ప్రత్యుపకారార్థీ విపత్తౌ లభతే ఫలమ్

ద్విషతా మేవ కాలోఽస్తు యో స్యాభవతు తస్య వా-

'అనయా చ ప్రార్థనయా వసంతసేనా చారుదత్తద్వేషిణః తద్వి దుత్పాదకప్రవృత్తస్య శకారస్య స్వప్రవృత్తివైఫల్యపూర్వకవిపత్త్వ

1. Journal of the Mythic Society, Bangalore Vol. 9— P. 181 & 85 (1919).

త్రిలక్షణః కథావస్తుశేష ఉపరితనే ష్వంకేషు ఘటనీయః సూచితః" అని గణపతిశాస్త్రిగారి వ్యాఖ్యానము. సజ్జలకుని ప్రార్థన మెటులు సఫలీకృతము నొందినదో చారుదత్తమునఁ దెలుపఁబడియుండలేదు.

(5) చతుర్థాంకమున వసంతసేన సజ్జలకునితో 'ఇమం తస్మై చారుదత్తాయ దదా త్వార్యః' అనియును, దనచెలితో 'ఏహి. ఇమ మలంకారం గృహీత్వా ఆర్య చారుదత్త మభిసరిష్యావః' అనియుఁ బల్కుటచే నలంకారమును, జారుదత్తుని కొసఁగుట నాటకమందు వర్ణిత మని తోఁచుచున్నది. అట్టికథాంశము చారుదత్తమునఁ గానరాదు. మఱియు 'ఏదం పుణ అభిసారిఆ సహాఅభూదం దుద్దిణం ఉణ్ణమిదం' (ఏత త్పున రభిసారికా సహాయభూతం దుర్దిన మున్నమితమ్') అనుచతుర్థాంకాంత చేటీవాక్యము మృచ్ఛకటికమునఁ జతుర్థాంకమునఁ గల కథాభాగమును సూచింపుచున్నది. వసంతసేన 'హదాసే! మాహఖు బఢ్ఢావేహి' (హతాశే! మాఖలు వర్ధయ) అనుటయు నామెభావికష్టములను సూచించు నని సుక్తంకరుగారు వ్రాసియున్నారు.

(6) శకారుఁ డెటులు వసంతసేనపై ద్వేషము వహించి యామెను బాధింప యత్నించెనో చారుదత్తమున లేదు. మృచ్ఛకటికమునందు వలె వసంతసేనం జంప శకారుఁడు యత్నింపనిచో నాతనిపాత్రప్రవేశము నిరర్థకము. ప్రథమాంకమునఁ జారుదత్తుని కాతఁ డంపిన సందేశమును దానినే స్పష్టపఱచుచున్నది. సంవాహకసజ్జలకుల కృతజ్ఞతయుఁ గార్యరూపము నొంది యుండలేదు.

కదా ఖ ల్వస్యాః ప్రతికర్తవ్యం భవిష్యతి-చారు-అంక-4.

సజ్జలకుఁ డెట్లు వసంతసేనకుఁ బ్రతికృతి నొనర్ప యత్నించెనో వివరింపఁబడలేదు. పైకారణములవలనఁ జారుదత్తనాటక మసంపూర్ణముగ నున్నటుల స్పష్టము. భాసుఁడు దాని నసంపూర్ణముగ నేల రచియించెనో తెలియరాదు. భాసుఁ డీనాటకమును సంపూర్ణముగ రచియించె ననియు, శూద్రకుఁడు దానిని సంస్కరించె ననియుఁ గొందఱు విమర్శకుల యభిప్రాయము.[1]

1. • Sudraka and Mricbakatika — by Mehendale- Bhandarkar Commemoration Volume - P. 367 - 374.

(b) చారుదత్తము మృచ్ఛకటికనాటకమునందలి మొదటినాలు గంకముల సంక్షేపరచన మేలకాదు? అనువిషయ మిపుడు విమర్శింప వలసియున్నది. మృచ్ఛకటికాచారుదత్తముల కథాసంవిధానాదుల విమర్శించి మార్గెరుట్సెరనుపండితుఁడు మృచ్ఛకటికము చారుదత్తము ననుసరించి రచింపఁబడినది కాని చారుదత్తము మృచ్ఛకటికమునకు సంక్షేపరూపరచనము కాదని స్థిరపఱిచెను. విమర్శకు లీవిషయమున భిన్నాభిప్రాయులై యున్నారు. శ్రీయుత హీరానంద శాస్త్రిగారు తమగ్రంథమున నీవిషయముఁ జర్చయొనరించి (పు. 21-24) చారుదత్తము స్వతంత్రగ్రంథము కాదని యొక నిర్ణయ మొనరించిరి. శూద్రకుఁడు భాసునిగ్రంథమును గైకొని తనపేర నేల ప్రచురింపవలయును? 5 మొదలు 10 వఱకు నాటకములు రచింపఁగల మేధావి మొకటి నాలుగంకములును రచింపలేఁడా? శూద్రకుని యొక్క రచనానైపుణ్యము తరువాతియంకములలోనే కానవచ్చుచున్నది. అట్టికవి పరవిరచిత మగు గ్రంథమును, జంకునుగొంకును లేక స్వవిరచితముగఁ గైకొనునా? యని వీరును వీరిమతానుయాయులును బ్రశ్నించుచున్నారు. ప్రథమమున శూద్రకుని గుఱించి కొన్నివిషయములను దెలుపవలసియున్నది. శూద్రకుఁ డేకాలమువాఁడో, యేదేశము నేలెనో యింతవఱకును నిర్ణయ మొనర్పఁబడి యుండలేదు. కాళిదాసునకుఁ బ్రాచీనుఁ డని కొందఱును నర్వాచీనుఁ డని కొందఱు ననుచున్నారు. చారుదత్తమృచ్ఛకటికములకుఁ గలపోలికను బట్టియు, పైవిషయములు స్థిరపఱుపఁబడక పోవుటవలనను, భాసశూద్రకు లొక్కరే యనియు క్రీ. శ. 4, 5 శతాబ్దముల నుండి రనియు నొకనూతనవాదముకూడ వచ్చినది.[1] ఈవిషయముల విమర్శించినచోఁ జారుదత్తము భాసునిచేఁ బ్రథమమున రచింపఁబడె ననియు, నది యసంపూర్ణ మగుటచే శూద్రకుఁడు దానిని బూర్తి యొనర్చె ననియు సహృదయులకుఁ దోఁచకమానదు. గ్రంథము శూద్రకునిపేర నుండుటేల యనిన-కాదంబరీ దశకుమారచరితము లే తార్కాణ

1. K. G. Sankar — Bhasa Problem — Ashutosh Mukherji Commemoration Volume.

ము. కాదంబరీదశకుమారచరితముల నిద్దఱుకవులు రచించి రని విమర్శ కు లంగీకరించియున్నారు. మనోహర మగుచారుదత్తనాటక మసంపూర్తిగాఁ గానఁబడుటచే శూద్రకుఁ డేల దానిని పూర్తియొనర్పరాదు ? ఇం దు న్యాయవిరుద్ధ మేమియును లేదు. చారుదత్తమును గొంత మార్చి తనకథ కనుగుణముగా శూద్రకుఁడు మిగిలినభాగమును రచియించెను. చారుదత్తమునఁ గలకథాభాగము కొంచె మెచ్చుతక్కువగ మృచ్ఛకటిక మునఁ గననగుటచే నాలంకారికులు మృచ్ఛకటికమునుండియే యుదాహ రణాదులఁ గైకొనిరి. అయినను చారుదత్తనాటకము వారికిఁ దెలియని ది కాదు. వామనుఁడు కావ్యాలంకారసూత్రములలో, చారుదత్తములోని

"యాసాం బలి ర్భవతి మద్గృహదేహలీనాం
హంసైశ్చ సారసగణైశ్చ విలుప్తపూర్వః
తాస్వేవ పూర్వబలిరూఢయవాంకురాసు
బీజాంజలిః పతతి కీటముఖావలీఢః" అను శ్లోకము నుదాహరించి

యున్నాఁడు. ఇది చారుదత్తశ్లోకమునకుఁ జేరికగా నున్నయది. ఇందువలన వామనునకుఁ జారుదత్తనాటకము తెలియు నని నిశ్చయము కదా. మఱి యు రామచంద్రగుణచంద్రులు తమనాట్యదర్పణమున శూద్రకమృచ్ఛ కటికప్రశంస యొనర్చియును, దరిద్రచారుదత్తమును గూడ నుదాహరించి రి. అభినవగుప్తుని నాట్యవేదవివృతియందును "శాకుంతలచర్చా" అను వ్యాఖ్యానమునందును, జారుదత్తప్రశంస గలదు. చారుదత్తమృచ్ఛకటిక ములఁ బోల్చిచూచినచో చారుదత్తము స్వతంత్రనాటక మనియు సంగ్ర హము కాదనియు స్పష్టపడఁగలదు.

(1) చారుదత్తమున వసంతసేన విటశకారులచే ననుగమ్యమాన యైనది. మృచ్ఛకటికమున విటచేటశకారులు మువ్వురు గలరు.

(2) చారుదత్తమున ద్వితీయాంకమున మృచ్ఛకటికమునందువలె మాథుర, దర్దురక, ద్యూతకరులు గానవచ్చుట లేదు. మృచ్ఛకటికములో జూదరులజీవితము చక్కగ వర్ణింపఁబడినది. నీచపాత్రములు స్వాభావిక ముగఁ జిత్రింపఁబడినవి. చారుదత్తమున నివి విడువఁబడ నేల ?

(3) సంవాహకుఁడు చారుదత్తమునఁ బరివ్రాట్టగును- మృచ్ఛకటికమున శాక్యశ్రమణకుఁ డగును.

(4) ఆర్యక,పాలకులవృత్తాంతము చారుదత్తమునఁ గానరాదు. మృచ్ఛకటికము మూలగ్రంథ మగుచోఁ జారుదత్తమున నీయితివృత్తము విడువఁబడుటకుఁ దగినకారణము గానరాదు.

(5) మృచ్ఛకటికమున, చారుదత్తశ్లోకములు కొన్ని విడువంబడినవి. (అంక 1- శ్లో 1, 4, 7, 13, 16 ఇత్యాదులు.)

(6) చారుదత్తమున లేని నూతనశ్లోకములు చేర్పఁబడినవి (అంక 1-శ్లో 14, 15, 20, 21, 23, 24, 25, 26, 32, 37, 38 మొదలగునవి).

(7) దారిద్ర్యవర్ణనము చారుదత్తమున 'దారిద్ర్యాత్ పురుషస్య బాంధవజనో' అను నొక్కశ్లోకముననే గావింపఁబడినయది. దీనికి మృచ్ఛకటికమున-

'నివాస శ్చింతాయాః' 'దారిద్ర్యాత్ హ్రియమేతి' 'సంగం నైవహి కశ్చి దస్య కురుతే', 'దారిద్ర్య శోచామి' అనుశ్లోకములు చేర్పఁబడినవి.

(8) చారుదత్తము మృచ్ఛకటికమునకు సంగ్రహ మగుచో మృచ్ఛకటికమున లేనిశ్లోకములు, వచనభాగములు చారుదత్తమున నేల గన్పడవలయును? మృచ్ఛకటికనాటకమును సంగ్రహ మొనర్చి నూతనవిషయములఁ జేర్ప నవసర మేమి కలిగినది.

చారుదత్తమునఁగల 'దారిద్ర్యం ఖలునామ మనస్వినః పురుషస్య సోచ్ఛ్వాసం మరణమ్' యనువచనము మృచ్ఛకటికమున లేదు.

(9) చంద్రవర్ణనమును (అంక-1) జూడుఁడు. మృచ్ఛకటికమున-

ఉదయతి హి శశాంకః కామినీగండపాండుః
గ్రహగణపరివారో రాజమార్గప్రదీపః

అనియుండ, చారుదత్తమున-

ఉదయతి హి శశాంకః క్లిన్నఖర్జూరపాండుః
యువతిజనసహాయో రాజమార్గప్రదీపః

కొనినాఁడు. కోటిశబ్దము ద్వితీయపాదమున నుండుటచే, చతుర్థపాదమున నది వదలి 'తీక్ష్ణం విషాణాగ్ర మివావశిష్టమ్' అని మార్చుకొనిమెను. దీనివలన 'నిమజ్జమానా విషాణకోటీవ' యనుచో మన కనుల కగపడు దృశ్యము మాయమైనది. మూలశ్లోకముయొక్క సరసతయుఁ జెడినయది- చారుదత్తమునుండి మృచ్ఛకటిక ముత్పత్తినొందినదియు స్పష్టము.

(14) 'లింపతీవ తమోంగాని' యనుశ్లోకము మృచ్ఛకటిక కథాభాగమునకంటెఁ జారుదత్తమునఁ బాగుగా నతుకుచున్నది. ఆలంకారికుఁడగు దండి యాశ్లోకపాదమును దనకావ్యాదర్శమునం గైకొనెను. బాలచరితమునఁగూడ నీశ్లోకమే యుండుటచే, మృచ్ఛకటికము చారుదత్తము ననుసరించి వ్రాయఁబడిన దను యూహను బలపఱుచుచున్నది.

చారుదత్తము ప్రాచీన మనియు, మృచ్ఛకటికాకారుఁడు కొన్ని శ్లోకముల వదలి వైచియుఁ, గొన్నిటినిఁ జేర్చియు, గొన్నిటిని మార్చియుఁ గథాభాగమును విస్తరించియుఁ దనగ్రంథమును రచియించెననుటస్పష్టము. శూద్రకునకు గ్రంథచౌర్య మాపాదింపనేల యని భాసశూద్రకుల కైక్యము గల్పించియుఁ జారుదత్తమును మృచ్ఛకటికాసంగ్రహ మని వాదించియుఁ బండితులు వివిధమార్గముల ద్రొక్కిరి. అసంపూర్ణ మగు చారుదత్తమును, దనకుఁ దోఁచినరీతిని సవరించి సంపూర్ణమొనర్చినచో శూద్రకునకుగ్రంథచౌర్యమెట్లువాటిల్లును? ఇంతకును దశమాంకమునందుఁ గొంత భాగము శూద్రక విరచితము గాదనియును, నీలకంఠవిరచిత మనియును విమర్శకు లంగీకరించియున్నారు. శూద్రకుఁ డనుకవి నిజముగ లేఁ డనియు నెవరో వ్రాసి యది శూద్రకుని కంటఁగట్టి రనియుఁ గొందఱు వాదించుచున్నారు. ఎవ రయిననేమి, మృచ్ఛకటికారచన మాకవియశశ్చంద్రికల వెదచల్లుచున్నది. అసంపూర్ణ చారుదత్తపూరణ మతనికి న్యూనత నాపాదింపదు.

ఇక భాసశూద్రకు లొక్కరే యనుశంకరపండితునివాదము విమర్శింపవలసియున్నది. ఈవాదమున భాసుఁడు మృచ్ఛకటిక పద్మప్రాభృతి కర్త యనియు, శూద్రకుఁడు మాళవదేశమును క్రీ. శ. 475 ప్రాంతము

చాలించె ననియు నిర్ధారణ మొనర్పఁబడినది[1]. వీరివాదమునందుఁ గల ముఖ్యాంశములు:—

(1) ఆలంకారికులు భాసశూద్రకుల నిద్దఱను దమగ్రంథములఁ జేర్కొనకపోవుట- నాట్యదర్పణమున దరిద్రచారుదత్తమృచ్ఛకటికముల ప్రశంస యుండుటయే దీనిని ఖండించుచున్నది.

(2) 'లింపతీవ తమోఽంగాని' యను శ్లోకము శూద్రకవిక్రమాదిత్యమేంఠుల దని యాలంకారికు లనిరి, కాని, భాసుని దని యెవరును జెప్పియుండలేదు.

(3) మృచ్ఛకటిక పద్మప్రాభృతికములు, శైలియందు, స్వప్నవాసవదత్తాదులఁ బోలియుండుట- మృచ్ఛకటికమునందలి ప్రస్తావన శూద్రకునిది గాదు. శూద్రకుని యనంతర మెవరో రచించినటులు స్పష్టము.

(4) శూద్రకుఁడు వత్సరాజచరితమును రచియించె నని ప్రతీతి గలదు. భాసుని ప్రతిజ్ఞాయౌగంధరాయణము కొన్ని ప్రతులలో వత్సరాజచరితే మనునామాంతరముతోడఁ గానవచ్చుటచే, భాసుఁడును శూద్రకుఁడు నొక్కరే యనవలయును.

(5) 'శూద్రకుని కగ్నిమిత్రుఁ డని నామాంతరము గల దని క్షీరస్వామి యమరవ్యాఖ్యలో నుదాహరింపఁబడిన (నామమాలా) శ్లోకము వలనఁ దెలియుచున్నది. అగ్నిమిత్ర, జ్వలనమిత్ర శబ్దములు పర్యాయపదములు. వాక్పతిరాజు గౌడవహామునందు 'భాసమ్మి జలణమిత్తే' అని స్తుతించియుంటచే భాసశూద్రకు లొక్కరే. ఇది సరికాదు; వాక్పతిరాజ శ్లోకమునఁ జ్వలనమిత్రుఁ డనుటచే నగ్నిమిత్రుఁడను శూద్రకుని నామాంతరము సూచింపఁబడుటలేదు. స్వప్నవాసవదత్తమున లావాణకదహనమును, గవి వర్ణించి యుండుటచేఁ గాని భాసనాటకము లగ్నిం బరిక్షిప్తము లగుటచేఁ గాని పంచరాత్రాదినాటకములలో నగ్నివర్ణితమగుటచేఁ గాని భాసునకు జ్వలనమిత్రుఁ డను బిరుదనామము ఘటిల్లి యుండవచ్చును.

1. K. G. Sankar—The Problem of Bhasa in Sir Ashutosh Commemoration Volume.

పైవిషయములవలన, భాసశూద్రకుల యైక్యత మెట్టిదిరానాకమగువిషయములతో నుపపాదింపఁబడినదో యూహింపనగును. మృచ్ఛకటికమునఁ గలపాత్రపోషణము, కథావిధానము దల్లికయు, రసవిజృంభణము, మున్నగునవి భాసగ్రంథములకన్న విశేషాంశము లని తోఁపక మానదు. అందును మొదటి నాలుగంకములకన్న మిగిలిన మృచ్ఛకటికాభాగములే రసవంతము లని విమర్శకుల యభిప్రాయము. మృచ్ఛకటికాచారుదత్తములఁ గలప్రాకృతభాషవలన వానియం దేది మఱి యొకదాని ననుకరించుచున్నదో నిర్ణయించుట కష్టసాధ్యము. ప్రస్తుతపరిశోధనమునఁ జారుదత్త మసంపూర్ణ మనియు శూద్రకుఁడే యసంపూర్ణగ్రంథమునకు మిగిలినయంకములఁ జేర్చియు, కథాభాగములను విస్తరించియు మృచ్ఛకటికమును రచించె ననియుఁ దేలుచున్నది. హిందూనాటక

తప్రాకృతభాషలు వాడుకలో జీవభాషలుగా నుండుట లేదనియుఁ దజ్జన్యము లగుదేశభాషలయందే వ్యవహారాదికములు నడపఁబడుచువచ్చెననియు భాషాశాస్త్రవేత్తలు దెలుపుచున్నారు. పాణిన్యాదులచే సంస్కరింపఁబడిన సంస్కృతభాష గాని దానికిఁ జేరువగ నుండునది గానియు గ్రవర్ణములవారికిని బండితులకును వాడుకభాష యయ్యెను. స్త్రీలకును పామరజనులకును బ్రాకృతభాషలు వాడుకభాష లయినవి. దేశవిభాగము ననుసరించియు, విదేశీయుల సంసర్గాదులచేతను వివిధప్రాకృతము లుద్భవించినవి. అందువలన నాటకములం దుత్తమపాత్రములకు సంస్కృతభాషయు, స్త్రీలకును నీచపాత్రములకును బ్రాకృతభాషయును గవులు దమగ్రంథముల నుపయోగించిరి. స్త్రీలు, విదూషకుఁడు మొదలగుపాత్రములకు శౌరసేనియు, జాలరులు, విదేశీయులు మొదలగు వారికి మాగధియు, శ్లోకములకు మహారాష్ట్రప్రాకృతము నుపయోగింపఁబడుచు వచ్చెను.

సంస్కృతనాటకములందుఁ గల సంస్కృతప్రాకృతమిశ్రమమునకుఁ గారణ మేమి యని పాశ్చాత్యులు తర్కించి హిందూదేశమున క్రీస్తుశకమునకుఁ బూర్వమే యవి ప్రచారముననుండి పామరజనులచే నుపయోగింపఁబడుటయే యందులకుఁ గారణ మని నిశ్చయించిరి. మహాకావ్యములగు రామాయణమహాభారతములు సంస్కృతభాష యందు రచింపఁబడుటచే నాభాష జనసామాన్యమునకుఁ గూడ సులభగ్రాహ్యముగ నుండెడిది యని వీరి యాశయము. రామాయణ మహాభారతములు ప్రాకృతభాషాజన్యము లే యనియు నిటీవల సంస్కరింపఁబడి నేటిస్వరూపమును గాంచిన వనియుఁ గొందఱు తలంచుచున్నారు. కొంతకాలమున కీప్రాకృతభాషలును స్థిరత్వమును గాంచినవి. వైయాకరణులును వీనికి వ్యాకరణముల రచియించిరి.

కాళిదాసుని యనంతర మీ ప్రాకృతభాషలు విశేషప్రచారము నందకపోవుటచే గవులు తమగ్రంథములఁ బ్రాచీననిబంధనముల ననుసరించియుఁ బ్రాచీనగ్రంథములఁ గల ప్రాకృతభాషను గైకొనియుఁ దమతమ గ్రంథములరచియించియున్నారు. అందువలన మనగ్రంథములఁ గలప్రాకృ

తభాషనే యాధారముగఁ గొని గ్రంథముల ప్రాచీనతను నిర్ణయింపరాదు. అట్లునిర్ణయింప యత్నించుటయు సుగమము కాదు.

అశ్వఘోషునిప్రాకృతము భాసకాళిదాసులప్రాకృతముకంటెఁ బ్రాచీన మని కొందఱు పండితుల యభిప్రాయము. ఇరువురకు భిన్నముగవాదించువారును గలరు. భాసనాటకములఁ గలప్రాచీనప్రాకృతప్రయోగములఁ గొన్నింటి నిటఁ జూపుదును.

సంస్కృతము.	ప్రాచీనప్రాకృతము.	కాళిదాసాదుల ప్రాకృతము.
(1) ఖలు	ఖు	క్ఖు
(2) త్వం	తువమ్	తుమమ్

భాసనాటకములనొండురెండుస్థలముల తుమమ్ అనియుఁగలదు.

(3) తవ	తవ	తుహ, తుజ్ఝ
(4) ఆర్య	అయ్య	అజ్జ
(5) కృత్వా	కరిఅ	కదు అ
(6) గత్వా	గచ్ఛి అ	గదు అ

శాకుంతలమున 'కరిఅ' విక్రమోర్వశీయమున 'కదుఅ' 'గదుఅ' అని కలదు.

(7) ద్వితీయాబహువచనమున నపుంసకలింగపదములకు శాకుంతలాదుల 'ఆఇం' అను ప్రత్యయముగన్పడును. (సుకుమారకేసరసిహాఇం, సిరీసకుసుమాఇం 11-4)

భాసనాటకములయందును, అశ్వఘోషునిగ్రంథములందును, అశోకునిశాసనములందును 'అని' ప్రత్యయముతోఁ గూడియుండును.(అహిఅరమణీఅణి ఉదఅణ్హాణాణి-అధికరమణీయాని ఉదకస్నానాని)స్వప్నవాస.

(8) అహం-అహకె-తరువాత హకె, హగె అయినది. భాసకాళిదాసులగ్రంథముల అహం అనియే కలదు.

ఆధావతి, ప్రథర్షిత, ఇత్యాది పదములఁ గలధకారము భాసుని ప్రాకృతమున హకార మాయె ననియు, నట్టిమార్పు యశోక శాసనములఁ గలదనియు ఘటకుగారు తమవ్యాసమున నిరూపించి యున్నారు. భాసుఁ డశ్వఘోషునికిని బూర్వుఁ డని వీరివాదము.

ఇట్టి ప్రాచీనప్రాకృతప్రయోగములు ఆశ్చర్యచూడామణి, ప్రద్యుమ్నాభ్యుదయము, తపతీసంవరణము, సుభద్రాధనంజయము, మత్తవిలాసము మొదలగుదక్షిణదేశనాటకములందుఁ గల వనియు, నివి యన్నియు క్రీ. శ. ఆఱవశతాబ్దానంతరమున రచియింపఁబడుటచే భాసునిప్రాచీనత్వమును బ్రతిఘటించుచున్న వనియును హీరానందశాస్త్రిగారు వ్రాసియున్నారు. [1]ఇటీవలి కవులు తమగ్రంథములఁ బ్రాచీనకవులప్రాకృతమును గైకొనుట మనకు విదితమే. క్రీ. శ. 10 వ శతాబ్దమునఁగూడ రాజశేఖరుఁడు ప్రాకృతమున గర్పూరమంజరీసట్టకమును రచియించియున్నాఁడు. మిగిలిన యాధారములవలనఁ గవి ప్రాచీనుఁడని మనము నిర్ణయించినచో, నతనిప్రాకృత మాధునికగ్రంథముల గానవచ్చుట యతని ప్రాచీనత్వమునకు భంగకరము కాదు. దక్షిణదేశమునం బ్రచారమునందుఁ గల ప్రాకృతము ఔత్తరాహులప్రాకృతమునకుఁ బ్రాచీన మనియు, దానివలె విశేషముగ మార్పులఁ జెందలేదనియు వూల్నరుగారు వ్రాసియున్నారు. గ్రంథములం గల ప్రాకృతభాషవలననే కవుల దేశకాలాదులనిర్ణయ మొనర్పరా దను విషయము మన మంగీకరింపవలసినదే. భాసుని ప్రాకృతమును విమర్శక దృష్టితో లెస్నే (Lesny) ప్రింట్జు (Printz) మొదలగు పాశ్చాత్యులు చదివి యందలి విషయములను విమర్శించి యున్నారు. సుక్తంకరుగారును భాసనాటకములం గల ప్రాకృతభాషవలన నిదమిత్థ మని వక్కాణింప వీలు లేదనిరి. భాసుఁడు క్రీ. శ. 2, 3 శతాబ్దములవాఁడై తిరువనంతపుర నాటకము లాతనివే యయినచో నతనిప్రాకృతము, అశ్వఘోషకాళిదాసుల మధ్యకాలమును సూచించుచున్న దనియు, ప్రాకృతభాషయొక్క మార్పులను స్పష్టీకరించుచున్న దనియు డాక్టరు వూల్నరుగారు (Dr. Woolner-Introduction to Prakrit-P. 74-75) తమగ్రంథమున వ్రాసిరి. అదియే యుక్తమని తోఁచుచున్నది.

---

1. Bhasa and the authorship of the thirteen Trivendrum plays by Hirananda Sastri.

ఉదాహరణగ్రంథములు.

నిడుదవోలు వేంకటరావుగారు బి. ఏ., కాకినాడ.

(1) బసవోదాహరణము.

ఆంధ్రవాఙ్మయమున మన కుపలబ్ధము లగునుదాహరణములలో బసవోదాహరణము మొదటిది. పూర్వలాక్షణిక శైవకవిసార్వభౌముఁడు పాల్కురికి సోమనాథుఁడు దీనిని రచియించినాఁడు. సోమనాథుఁడు తెలుఁగుననే గాక సంస్కృతమునఁ గూడ నుదాహరణమును రచియించెను. తెలుఁగుబసవోదాహరణమును ప్రభవసంవత్సరము మాఘభారతియందు బ్రహ్మశ్రీ ప్రభాకరశాస్త్రిగారు ప్రకటించినారు. సంస్కృతమునఁ గలయుదాహరణ మముద్రితము. ఈయుదాహరణము క్రీ. శ. 1220 ప్రాంతముది కావచ్చును.

(2) త్రిపురాంతకోదాహరణము.

కాలక్రమమున ద్వితీయ మయ్యును, గవితాప్రకర్షయం దద్వితీయ మగునీయుదాహరణము రావిపాటి త్రిపురాంతకమహాకవి ప్రణీతము- దీనిమాతృక తంజావూరు శరభోజీ సరస్వతీభవనగ్రంథభాండాగారమునఁ గలదు- క్రీ. శ. 1912 వ సంవత్సరమున మానవల్లి రామకృష్ణకవిగారు దీనిని ముద్రించినారు- కవిగారే తిరిగి దీనిఁ 1933 వ సంవత్సరము ఏప్రియలునెలలో తిరుమల శ్రీ వేంకటేశ్వరపత్రిక ప్రథమసంపుటము నవమసంచికయందుఁ బ్రకటించియున్నారు. నే నీయుదాహరణమును మూఁడవతూరి ప్రకటించుచున్నాఁడను. ఈయుదాహరణకాలము- క్రీ. శ. 1370 సంవత్సరప్రాంతము.

(3) వేంకటేశ్వరోదాహరణము.

శ్రీతిరుపతి క్షేత్రమున సంకీర్తనాచార్యులై మహాప్రఖ్యాతినివహించిన తాళ్లపాకవారిలోని పెదతిరుమలయ్యగారీయుదాహరణమును రచియించినారు. ఇయ్యది పైనుదాహరించిన తిరుమల శ్రీవేంకటేశ్వరపత్రికయందు సప్తమసంచికయందు మా. రామకృష్ణకవిగారిచేఁ బ్రకటితమైనది. ఈయుదాహరణము క్రీ. శ. 1530 ప్రా తమున రచియింపఁబడి యుండును.

(4) హనుమోదాహరణము.

లక్షణసారసంగ్రహమును రచియించిన చిత్రకవి పెద్దన తనలక్షణ

గ్రంథమునం దుదాహరణలక్షణమును జెప్పి దానికిలక్ష్యముగా హనుమం తునిపరముగా నొకయుదాహరణమును రచియించియున్నాఁడు. ప్రస్తుత మీపరిషత్పత్త్రిక యందు ప్రకటిత మగుచున్నలక్షణసారసంగ్రహమునందు ద్వితీయాశ్వాసమున నుండుటచే నీయుదాహరణ మల్పకాలములోనే ముద్రణభాగ్యమునందును. ఈయుదాహరణకాలముక్రీ.శ.1560ప్రాంతము.

(5) శ్రీకృష్ణోదాహరణము.

గొప్పకవి యగునప్పకవి తనయప్పకవీయము చతుర్థాశ్వాసమున నుదాహరణలక్షణమునుం జెప్పుచు లక్ష్యముగాశ్రీకృష్ణునిపరముగానీయు దాహరణము రచియించియున్నాఁడు. అప్పకవికాలము సునిశ్చితమైనదే- ఈయుదాహరణము క్రీ. శ. 1656 సంవత్సరమున రచియింపఁబడినది.

(6) శేషార్యోదాహరణము.

శ్రీనల్లందిగళు వంశజుఁడైన శేషార్యునిప్రశస్తిని వర్ణించుచు, బాల కవి యనంతయ్య రచియించినది. ఇది యముద్రితము. ఈశేషార్యుఁడు మధురనాయకుఁడగు విజయరంగచొక్కనాథుని యమాత్యుఁడగుటచేఁ గవియు నాకాలపువాఁడే. విజయరంగచొక్కనాథుఁడు క్రీ. శ. 1704 మొదలు క్రీ. శ. 1730 వఱకుఁ బరిపాలించినవాఁడు. శేషోదాహరణము క్రీ. శ. 1720 సంవత్సరప్రాంతముల రచియింపఁబడి యుండవచ్చును.

(7) విశ్వేశ్వరోదాహరణము.

ఏనుఁగు లక్ష్మణకవి విశ్వేశ్వరోదాహరణము రచియించినట్లు భర్తృహరి యాంధ్రీకరణమువలనఁ దెలియుచున్నది. కాని యీయుదాహరణము లభ్యముకాలేదు. దీనిరచనాకాలము క్రీ. శ. 1760 ప్రాంతము.

(8) ముఖలింగేశ్వరోదాహరణము.

నలువదేండ్లక్రిందట కళింగదేశాంతర్గత జలుమూరు వాస్తవ్యుఁడు మచ్చ వేంకటకవి ముఖలింగేశ్వరుని పేర నుదాహరణము రచియించి నాఁడు. ఇయ్యది యాకాలమున ముద్రింపఁబడినది. శుద్ధాంధ్రనిరోష్ఠ్య నిర్వచనమున శుకచరిత్రమును రచియించుటవలనను నాగ్రంథ మముద్రిత గ్రంథచింతామణియందుఁ బ్రకటింపఁబడుటచేతను నీతఁడు ప్రసిద్ధిఁ జెందె ను. రచనాకాలము 1896.

(అయ్యలరాజు రామభద్రకవి)

సకలకథాసారసంగ్రహము.

—: కృత్యాది :—

శా. శ్రీలీలావతి యైన రుక్మిణియు రాజీవాస్య యైనట్టి స
త్యాలోలాక్షియు నిర్వు రెప్పు డతివేలాసక్తి నిర్వంకలన్
హాళిన్ నిల్వఁ దటిద్వయీలలిత నీలాభ్రాకృతిం బొల్చు గో
పాలస్వామి దయాసుధారసము నాపైఁ జిల్లు నెల్లప్పుడున్. ౧

సీ. శ్రీవరనామధేయావాప్తిఁ జెన్నొంది
యబ్జపాణియనఁ బ్రఖ్యాతినొంది
భృగువంశము పవిత్రముగఁ బ్రేమ జనియించి
నాళీకవరవదనమున మించి
కమలరాశి నివాసగరిమచేఁ గడునిక్కి
వరవర్ణిని యనంగఁ బ్రాడికెక్కి
ఘనకాంతిఁ దనరి భూజననుతదేవతా
రామాభిధానత రమణనొసరి
పుణ్యజనుల సుదర్శనంబుననె పెంచి
తగువిధూత్తమవిశదవిస్తారకీర్తి
నిజకటాక్షాంచలంబులు నిగుడఁజేసి
నిత్యలైశ్వర్యములు కరుణించుఁ గాత. ౨

మ. హరివక్షఃస్థలశక్రనీలమణి సౌధాగ్రంబునన్ వైజయం
తిరహిన్ దోలికనూఁగుచున్ సదనురక్తిం గౌస్తుభచ్ఛాయఁ జూ
చి రతి స్వేచ్ఛల నొందుచుం గవుఁగిటం జిత్తేశుఁ జొక్కించు నిం
దిర మాకీవుత సత్కృపారససమృద్ధిన్ నిత్యకళ్యాణముల్. 3

చ. అవనిధరాధినాథతనయాకుచకుంభవిలుప్తకుంకుమ
ద్రవ పరిలిప్త విస్ఫురదురఃస్థలిభాస్వదనూన నవ్యమా
ర్దవసుజపాప్రసూనకలితస్ఫటికాకృతిదోఁప నిత్యవై
భవమున నొప్పు శూలి నను భవ్యసుఖాన్వితుఁ జేయుఁగావుతన్. ౪

సీ. మహితనవీనాబ్జ మండలీకృతపతం
సాభ్ర కేశకలాప మతిశయిల్ల
ననుపమానూనసంతతమండనీరాజ
కమలభాసురపాళికరము వెలుఁగ
నగ్నిశిఖాకళాపారుణాలోకన
వదనాంబుజము వింతవగలుదెల్ప
నజహారివర్ణనీయపరాతిరోహిత
సచ్ఛుచి పాదముల్ సరణినొసరఁ
బరఁగి ప్రణవసువర్ణరూపమున నొప్పు
క్రతుమథనజాయమానరావనిధి మమ్ము
సాదరకటాక్షవీక్షణాసారలీల
నిశ్చలశ్రేయ మొసఁగి మన్నించుఁగాత. ౫

ఉ. మాళితటీజపాకుసుమ మాల్యరుచుల్ ప్రియమేన నిండినం
బోలఁగఁ జూచి యాతఁ డిదెమో కడుచిత్రము మేనఁ గుంకుమం
బేలయలందెఁ జందనమదేలయలందకయంచుఁ బెక్కుచం
దాలఁ దలంచు శాంభవి ముదంబున మాకు నభీష్టమీవుతన్. ౬

చ. తరగనిమోహభావమునఁ దన్నెడఁబాయుట కోర్వలేక వా
క్సరసిజనేత్రి నాత్మముఖకంజమున న్నివసింపఁజేసి సు
స్థిరమతి లోకపుంజము సృజింపుచు శాశ్వతకీర్తి నొప్పు నా
సరసిజగర్భుఁ డిచ్చు విలసత్కృప మాకుఁ జిరాయు రున్నతుల్. ౭

క. శ్రీశైలాకాంతనామకస్థితి గ్రహించి
నెగడు చతురాననప్రియ నిగమరాశి
యతులకలహంసగమన మహావిభూతి
సత్ఫురణ మాకు శుభము లొసంగుఁగాత. ౮

చ. దళముగ మాలఁ గల్పసుమదామముఁ జుట్టి సితాంబరంబు పైఁ
బలరఁ గటిం ధరించి ఘనహారలతల్ గళసీమఁ దాల్చి పైఁ
మలయజకర్దమం బలఁది మానితలీల నిజేశుకీర్తి నా
నలవడు వాణి నాదు రసనాగ్రమున న్నటియించుఁ గావుతన్. ౯

మ. పృథుహస్తంబు శిరోజమాల్యముల కర్థిం జాఁచఁబోఁ దన్ననో
రథముం గౌరి యెఱింగి వాహము కుమారా నాకు సింహంబనన్
వ్యథచే దానికిఁ బ్రీతిదోఁపఁ బ్రణతుం డైనట్టి గాంభీర్యవా
రిధి వేదండముఖుండు మత్కృతికి నిర్విఘ్నం బొసంగుం గృపన్. ౧౦

సీ. ధారుణీశనయా వ్యథాక్షణదాదిత్యుఁ
డాదిత్యగురు మునీహాందితుండు
కాలనేమిసురారిశైలేంద్రశతకోటి
పావనవంశవిభాకరుండు
నిజభక్తజనమనోనీరజప్రమదాళి
ప్రమదాళి నిత్యపరాఙ్ముఖుండు
అక్షరక్షోగణాధ్యక్షేభకేసరి
కేసరీకీర్తి శంకేజమిత్రుఁ
డైనహనుమంతుఁ డతిదాంతుఁ డతులమృకుర
సాతిశయసుకవిత్వమహత్త్వ మొసఁగి
ఖ్యాతిగాన సగటాక్షించి కరుణతోడ
గ్రంథమును సాంగమొనరించుఁ గవులునెన్న. ౧౧

క. మోహనమెలర్పఁగ రామధ
రాదయితుని విశదయశము ప్రకటించి యుజ
ప్రోదితఘనతపమునఁ దగు
నాదికవి న్వాకుజాతు నభినందింతున్. ౧౨

క. వితతప్రసిద్ధనిర్మల
చతురమతి సమస్తకలితశైల...శతకో
టితరణితేజున్ నేసం
తతమును వ్యాసులను గొలుతుఁ దద్దయు భక్తిన్. ౧౩

గీ. దండిసత్త్వ దండిఁదలఁచి మ్రొక్కిడి కాళి
దాసుఁ గాళిదాసుఁ దలఁచి కొలిచి
సిరత భవభూతి భవభూతి ధీరుఁ దలఁచి
బాణు రుచిజితాబ్జబాణు నెంచి. ౧౪

సీ. సోమనిభుఁడగు తిక్కనసోమయాజి
నిత్యసత్కీర్తిఁ బోతనామాత్యు సుకవి
భట్టభద్రుఁ జౌనన్నయభట్టుఁ గాంతి
భాస్కరుని భాస్కరునివేడ్కఁ బ్రస్తుతించి. ౧౫

చ. సరళపదార్థ విస్ఫురణ సంగతిఁ జాలనెఱిఁగి లక్షణం
బరమర లేక చూచి యమరాంధ్రములందుఁ గడుం బ్రవీణులై
సరసకళల్ గ్రహించి మృదుసారవచోరచనాచమత్క్రియా
పరులగు సత్ప్రపన్నులను భావికవీంద్రుల నాశ్రయించెదన్. ౧౬

తే. సరసగతుల రచించెడి శక్తిగలుగు
సుకవులకుఁ గాని సుకవులసూక్తిపటిమ
తెలియఁగా రాదు మూఢబుద్ధులకు మోయు
వానికిఁ దెలియుఁ గావడిబరు వనంగ. ౧౭

చ. సుకవులొనర్చు సత్కృతులు చూచి రసజ్ఞులుమెత్తు రెవ్వరేన్
బకములు హంససంఘములఁ బల్లఱు మెచ్చువిధంగి దుష్టపు
ల్వ్యకవిక నవ్వుచుం గొదవ లే పచరింపుదు రైననేమి సా
రెకు నిజబుద్ధి కుక్కలు మొఱింగిన జగము వాసి పోవునే. ౧౮

చ. చదివినవారు గాఢసరసక్రియఁ జెప్పఁ మహాప్రబంధము
ల్బమువనివారు నేర్చిరె కొలంది రచింపకయుంట లేదు శా
రద దయచేసినంతయుఁ జిరంబుగఁ గబ్బముఁ జెప్పి శ్రీకరా
స్పదముగ శ్రీరమేశునకొసంగుటకంటె విశేషమున్నదే. ౧౯

ఉ. నన్నయ తిక్కనాది కవినాథులు చెప్పినయట్లు చెప్పలే
కున్నఁ దదుత్తరాంధ్రకవు లూరకయుండిరె తోఁచినట్లు ని
త్యోన్నతబుద్ధిఁ గబ్బముల నోజరచింపక యుండు జ్ఞానసం
పన్నులకావ్యముల్ హరిసమర్పణమై చెలువొందు నెందునన్. ౨౦

హరిసమర్పితమైన యాసాధ్విఁ బోలె
భువిని బొలుపొందు సుజనసంపూజ్య మగుచు
నిట్టులగుటకు నరుదియె యెంచిచూడ
హరిపదస్పర్శఁ బాషాణ మతివ గాదె. ౨౧

చ. హరికి సమర్పణంబుగ మహాకవు లున్నతిఁ జేయుకావ్యముల్
అరయఁగఁ బావనంబు లని యార్యులు తప్పులనెన్న రెంతయు
న్నరయ ఖలుండు జాహ్నవిమునింగి పవిత్రముఁ బొందు కైవడిన్
బరుసముసోఁకఁగా నినుము భర్మము నైన తెఱంగునన్భువిన్. ౧౨

వ. అని యివ్విధంబున నిష్టదేవతాభివందనంబును శిష్టకవిజనాభినందనం
బును దుష్టకవినిందనంబును గావించి పరమశ్రావ్యంబును నత్యంత ది
వ్యంబును సకలబుధసేవ్యంబును నైనపురాతనచక్రవర్తిప్రముఖపుణ్య
పురుషకథాసంబంధబంధురం బగు శ్లోకప్రబంధంబు రచియింపంబూ
ని యున్న సమయంబున. ౧౩

సీ. చినుకుఁబూసలనొనర్చినబిత్తరపుదండ
దండాలు గలవేల్పుతబిసి కొండ
కొండాటములను జిక్కులు పన్ను జడదారి
దారిగట్టులరాయఁ జీరు టలుగు
అలుగుడింతికి వెన్నుఁ డీలకుఁ దెచ్చినచెట్టు
చెట్టు గట్టుగఁ జేయు చెలువ తోడు
తోడుచేడెలనేలు దొరకుఁ దోఁబుట్టువు
పుట్టఁలిబ్బులతేని పొందుకాఁడు
గాడుపూరినిగాచిన కన్నతల్లి
తల్లిబిడ్డలబెండ్లాడు గొల్లమనికి
మనికితము దీర్పు విలుకానిజనకువిందు
విందునీకీర్తి నరసింహవిభునికృష్ణ. ౧౪

వ. ఇట్లు కీర్తివిస్తారధురంధరుం డగుకృష్ణరాయనరపాలాఖండలుండు నన్నుఁ
బిలిచి శ్రీమత్సీతారామచరణకమల పరిచరణీయమాన మానసుండవు
బహువిధకవితాచమత్కారధుర్యుండవు సకలపురాణేతిహాస ప్రబంధరచ
నాదక్షుండవు మన్మనోరథకార్యనిర్వాహకుండవు నగుటం జేసి పురా
తనమహాకవి విరచిత ప్రబంధంబు లన్వేషించి భగవద్భక్తినిష్ఠాగరిష్ఠు
లగురాజశ్రేష్ఠుల వృత్తాంబులు ప్రసిద్ధంబు లగునట్లుగాఁ బ్రశస్తకథలు
విన్యస్తంబుగా నెలకూర్చి సాహిత్యలక్షణచిత్రకవిత్వ ప్రభావంబు లో
క్షోకచోటం గనుపడ రచియింపవలయునని ప్రార్థించిమఱియు నిట్లనియె.

చ. అరవిరి గుబ్బచన్నులె బయల్పడనీకను గూర్జరాంగనా
గురుకుచయుగ్మముం బలె నిగూఢముగాకను నాంధ్రదేశపుం
గలిత చనుంగవ న్వలె నొకానొకయించుక గానిపించిన
న్సరసులు మెత్తు రక్షవిల జాణలకుం గడురంజకం బగున్. ౨౬

వ. కావున నతిమధురరసాయనద్రాక్షాపాకంబుగా శృంగారరసయుక్తంబ
గునట్లు సకలకథాసారసంగ్రహంబు గ్రంథవిస్తారంబు గాకుండ నట్లుగా
రచియింపు మని యుపన్యసించిన సంతోషితస్వాంత తరంగితాంతరం
గుండ నగుచు నున్నసమయంబున. ౨౭

సీ. అఖిల జగత్స్థితోద్భవప్రభావమువాఁడు
ఘనఘననీలవిగ్రహమువాఁడు
దనుజభిచ్ఛక్రశంఖస్థిరకంకణమువాఁడు
సరసబాహాచతుష్టయమువాఁడు
స్ఫురదిందుబింబసుందరముఖాబ్జమువాఁడు
సవితృకోటిప్రకాశంబువాఁడు
శ్రీవత్సలాంఛనశ్రీవిలాసమువాఁడు
వర్ణితమురభీరవంబువాఁడు
సాదరకటాక్షవీక్షణాపాదితాబ్జ
భవపురందరనిత్యవైభవమువాఁడు
కాళియోరగవరఫణాకలితరత్న
కాంతిదీపితపాదయుగంబువాఁడు. ౨౮

సీ. శిఖిపింఛములదండ సిగవెలింగెడివాఁడు
కస్తూరి తిలకాళికంబువాఁడు
శ్వేతాబ్జముల నీరసించు కన్గవవాఁడు
నవసుధారుచి నవ్వు నవ్వువాఁడు
చక్రాదిసాధనాంచద్భుజంబులవాఁడు
రమణీయకంఠహారములవాఁడు
శ్రీవత్సకౌస్తుభాంచితమైన యెదవాఁడు
కలితకాంచీకటిస్థలమువాఁడు

కనక వస్త్రంబుగల మృదు తనువువాఁడు
భర్మనూపురయుత పదాబ్జములవాఁడు
మించి వేదాంతముల సంచరించువాఁడు
ప్రథిత శ్రీకృష్ణుఁ డను పేరఁ బరఁగువాఁడు. ౨౯

వ. మఱియు భాగ్యవశంబున స్వప్నకాలంబునఁ బ్రసన్నుం డై పరమ మంత్రోపదేశపూర్వకంబుగా సకలకథాసారసంగ్రహంబునకుఁ గృతి నాయకుని దన్నుం గావింపు మని హితోపదేశంబు చేసి యంతర్హితుం డైన నే నంతట మేలుకాంచి నాపురాతనకృతజన్మసుకృతంబునకుం బరమాహ్లాదంబు నొందుచు నద్దేవతాశిఖామణికిఁ బునఃపునః ప్రణామంబు లాచరించుచుఁ గర్ణాటమహీమండలాఖండలుండు నుప్రచండ పరాక్రమ పరరాజ శుండాల కంఠీరవుండును నగునరకంఠీరవరాయసూతి ప్రేరిత సకలకథాసారసంగ్రహనామక ప్రబంధంబు రచియింపం జాలుటకు నిప్పుడు గదా సమర్థుండ నైతి నని మహాధైర్యం బవలంబించి యిదియ కడ జన్మంబుగా నెంచుచుఁ గొంచక ప్రబంధం బుదంచితమతి రచియింపం బూని మదీయస్వప్నవృత్తాంతం బాలేయ మహీకాంతునకు నెఱింగించినఁ గుతూహలుం డగుచు నా రాజముఖ్యుం డిట్లనియె. ౩౦

ఉ. నీవును బాలకృష్ణపదనీరజభక్తుఁడ వార్యచిత్తమీ
దావహసద్గుణుండవు రమాధిపునింగిలలోనఁగాంచి య
ద్దేవుహితోపదేశమునఁ దేజమునొందినవాఁడ విన్నిటం
గావున నీప్రబంధము ప్రకాశముగా హరికిమ్ము నావుడున్.

వ. అనిన తద్వాక్యంబు మనోభీష్టసామ్రాజ్యదుర్గాధ్యక్షత్వంబునకు సులభసోపానమార్గంబుగా నెంచుచు నానందకందళితహృదయారవిందుం డనగుచుఁ బ్రబంధంబు రచియింపం బూనినవాఁడ నగుచు మదీయేష్టదైవం బగు నద్దేవతాసార్వభౌముని హృదయకమలకర్ణికామధ్యంబునఁ గనకాసనాసీనుం జేసి మానసపూజావిధానంబు సాకల్యంబుగాఁ గావించి నమస్కరించి యతనిం గుఱించి షష్ఠ్యంతములు విన్నవించెద.

క. శ్రీకరగుణధన్యున కరి,భీకరశౌర్యునకు మేరుపృథుధైర్యునకుం
బ్రాకటవీర్యునకును ర, త్నాకరగాంభీర్యునకును యదువర్యునకున్.

క. మురగజహర్యక్షునకున్, నిరుపమదృఙ్మృతవిషోగ్ర నిటలాక్షునకున్
బరశిక్షాదక్షునకును, నరపందాక్షునకు గోపికాధ్యక్షునకున్.

క. సురరిపుకులకాలునకును, సరసకపోలునకు సత్యశయశీలునకున్
మురళీరవలోలునకును, గురువాంఛాపాలునకును గోపాలునకున్.

క. సురహృదయచరిష్ణునకును, నరశార్ఙ్గసహిష్ణునకును నతజిష్ణునకున్
హారిమణిరోచిష్ణునకును, జిరశుభవర్ధిష్ణునకును శ్రీకృష్ణునకున్.

క. ఏవంవిధగుణతతికిని, దేవాచలనిభధృతికి యుదితదయామతికిన్
సేవితవాగధిపతికిని, భూవినుతోన్నతికి భోజపుత్రీపతికిన్.

వ. సమర్పణంబుగా నాయొనర్పంబూనిన సకలకథాసారసంగ్రహంబను
మహాప్రబంధంబునకుం గథాక్రమం బెట్టిదనిన.[1] ౩౮

సూర్యాణశబ్దార్థవిమర్శనము.

1936 సెప్టెంబరు నెల గ్రంథాలయసర్వస్వపత్త్రికయొక్క 136 వ పుటలో బ్రహ్మశ్రీ మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు "సూర్యాణ" పదమును గూర్చి కావించిన విమర్శనము చదివినాను. శ్రీశాస్త్రిగారు వేసిన ప్రశ్నములు చూచినపిమ్మట వారివంటి పరిశోధకులకును ముందు సకారాదిపదవిమర్శనము చేయునప్పుడు మాకును ఉపయోగింపఁ గల దను నూహతో మాకందికలో నున్న గ్రంథములతోడ్పాటునఁ దాక్షాలి కపరిశోధనము కొంత కావించితిని. తత్పరిశోధనపర్యవసానము నీక్రింద వ్రాయుచున్నాను—పాఠాంతరములు.

సీ. కడటివియలుసేసె నగరికి మాణిక్యపుకుటముల్ భూనివమనుజపతులఁ
దగునాజ్ఞ సూర్యాణముగ నొసరించె మంచిగ నేల నాలుగుచెఱఁగులకును

---

1. (ఈపద్యములవలన నీగ్రంథవిషయము శైలియుం దెలియును నని యింతమాత్రమే ప్రకటించితిమి. దీనిమూలము చెన్నపురి దొరతనమువారి ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారములో నున్నది.)

శ్రీతార్థిజనుల సచేతనత్యాగధ్వజములుగా నన్ని దేశములఁ బఱపె
దిక్కు లన్నింటను దెలుపారుపూఁత గావించె నుజ్జ్వలయశోవిభ్రమంబు
గీ. రాజసూయాధ్వరప్రవర్తకుఁడు నిత్య, సత్యభాషామహావ్రతశాలి పాండు
రాజదుగ్ధపయోనిధిరాజు ధర్మ, రాజు సుమ్ము మత్స్యావనీరమణ యితఁడు. భార. విరా.

ఆంధ్రసాహిత్యపరిషత్కార్యాలయములోని తాళపత్త్రప్రతులు కొన్ని చూడఁగా నీపట్టున భిన్నభిన్నపాఠాంతరము లగపడినవి. కాని యన్నిటికంటెను 'సూయాణ'పాఠమే సందర్భోచితముగా నున్నట్లు తోఁచినది. 'తగునాజ్ఞ నయ్యాణముగ నొనరించె' అని భారతము లక్ష్మీపతి సోమయాజులుగారిపాఠము. 'నయ్యాణము' 'సంవ్యాన' శబ్దభవమనియు, ఉత్తరీయము అని అర్థమనియు సోమయాజులుగారు తమవ్యాఖ్యలో వ్రాసినారు. కాని, లభించిన యన్నిపాఠములలోను శబ్దరత్నాకరపాఠమే ప్రశస్తతమముగ నున్నది. అం దిచ్చిన యర్థము కూడ సరిపడియున్నట్లే కాన్పించుచున్నది. ఈవిషయమున శ్రీశాస్త్రిగారును నేనును నేకాభిప్రాయులము. విమర్శనముకై మేము సేకరించిన పదములలో, ఈ పదమునకు భారతప్రయోగ మొకటియే తప్ప నితరప్రయోగము లేవియును లేవు. తెలుఁగునాఁట నిది వాడుకలో నున్నట్లుకూడ మాకుఁ గనఁబడదు.

వ్యుత్పత్త్యర్థము:—శబ్దరత్నాకరములో "సూయాణ" పదము వైకృతముగా గ్రహింపఁబడినది. దాని కుపోద్బలకముగా, పురుషోత్తమకవీయములో 'సూయన' 'సూయాన' పదములు ప్రకృతులుగా నీయఁబడినవి. కాని, మాకార్యాలయములో నున్న యే సంస్కృతనిఘంటువులోను ఆ పదములు లేవు. వ్యాకరణదృష్టితోఁ జూచునెడల నాపదముల సాధుత్వముకూడఁ జింత్యము. ఇఁక శ్రీశాస్త్రిగారు అదనముగా సూచించిన సుయాన' పదము, ప్రత్యేకముగా నిఘంటువులందు లేదు కాని కల్పించుకొనవచ్చును. అర్థసంబంధము కూడ నెట్లో కుదుర్చుకొనవచ్చును.

సూచియానము:—సజాతీయభాషాపద మేదైన దొరకవచ్చునేమోయని కిట్టెల్‌దొరగారి కర్ణాటాంగ్లనిఘంటువు చూడఁగా, అందుసరిగా 'సూయాణ' పదమే యీయఁబడినది. మఱియు నది 'సూచియాన' శబ్దభవ మనియు వివరణముకై శబ్దమణిదర్పణము చూడవలసిన దనియు

నందున్నది. కర్ణాటక శబ్దమణిదర్పణములోని తద్భవప్రకరణము 294 సూత్రము చదివి చూడఁగాఁ సమానపదములు విశ్రుతు లగునప్పుడు కొన్నిపట్టులఁ బూర్వపదాంత్యవర్ణలోప మగును. ఉదా:——దేవకుల-దేగుల; దేశశాఖా-దేసాకె,-సూచియాన సూయాణ" అని యున్నది. పిమ్మట విల్యమ్సు సంస్కృతాంగ్లనిఘంటువు చూచితిమి. 'సూచి' శబ్దమునకు సూచివ్యూహ మనునర్థము మనుస్మృతి భారతప్రమాణములతో నందీయఁబడినది. మనుస్మృతి 7-187 చూచితిమి. దానిక్రింది కుల్లూకభట్టవ్యాఖ్యానములో నిట్లున్నది.

"పిపీలికాపంక్తి రివ అగ్ర పశ్చాద్భావేన సంహతరూపతయా యత్ర సైనికావస్థానం స శ్రేష్ఠవీరపురుషముఖః సూచీవ్యూహః—తేన అగ్రతోభయే సతి యాయాత్."

ఈయాధారము ప్రబలమైన యాధారముగానే నాకుఁ దోఁచినది. దానిఁబట్టి "సూయాణము=సూచియానము, సేనను సూచివ్యూహముగా పన్ని శత్రువులపై వెడలు దండయాత్ర. అనఁగా శబ్దరత్నాకరములోఁ జెప్పినట్లు "శత్రుభీకర మగుదండయాత్ర" యనుభావమే తేలినది.

ప్రకృతసీసపాదసమన్వయము.

తగునాజ్ఞన్=సముచిత మగు నాజ్ఞను. నేల నాలుగుచెఱఁగులకును=భూమి నాలుగుదెసలకును. మంచిగన్=సౌమ్యముగ, సామోపాయముచే. సూయాణముగన్=శత్రుభీకర మగు దండయాత్రవలెనే. ఒనరించెన్=చేసెను.

"శరపీడక మగుదండయాత్రవలన నేప్రయోజనము నెఱవేఱునో యాప్రయోజనమును యావద్భూమియందును సౌమ్యముగఁ దనయాజ్ఞచేతనే ధర్మరాజు నెఱవేర్చుకొనెను" అని తాత్పర్యము.

విజ్ఞాపనము.

దీనికంటె మంచివ్యుత్పత్తి గాని మంచి యర్థము గాని గోచరించినచో విద్వాంసులు దయతో మాకుఁ దెలిపిన యెడల మేము వానిని వందనపూర్వకముగా గ్రహింతు మని విన్నవించుకొనుచున్నాను.

శ్రీసూర్యరాయాంధ్రనిఘంటు కార్యస్థానము, పిఠాపురము. } చర్ల నారాయణశాస్త్రి, మేనేజరు.

క్షీరనీరవిచారంబు సేయనేర్చు
వారువము నెక్కి యమరు లిర్వంకఁ గొలువ
నలువ చనుదెంచె నమ్మౌనినాథుఁ జేరి
వాణి యుండంగ వెదకెడువానికరణి. ౧౨౯

చ. మిసిమికడానికుందనపుమించుల నీనెడు మేనిడాలు న
ల్దెసలఁ జరించుచుండఁ జనుదెంచిన కాంచనగర్భుఁ గాంచి యిం
పెసఁగఁగ నమ్మహాముని మహీస్థలిఁ జాఁగిలి మ్రొక్కి భక్తిమై
వెసఁ గుసుమార్ఘ్య మిచ్చెఁ గడువేడుక శిష్యులతోడ గూడఁగ

గీ. అర్ఘ్యపాద్యంబు లొసఁగి యర్హాసనమున
మస్తకచతుష్టమకుటాగ్రమణిసమగ్ర
కాంతి విలసిల్లఁ గొలువున్న కమలభవుని
చెంతఁ దగ నిల్చి యంజలి సేసి పలికె. ౧౩౦

ఉ. నీకరుణావిశేషము గణింపఁగ శక్యమె చెల్మికల్మి వా
ల్మీకిగృహంబు మెట్టెఁ బరమేష్ఠి యటంచు సమస్తదేవతా
నీకము నెంచఁ జేసితివి నీరజసంభవ యింత చాలదే
చేకొని యెన్నిపుణ్యములు చేసితినో జననాంతరంబులన్. ౧౩౧

సీ. నారాయణుని దివ్యనాభిపంకరుహంబు
తల్లిగర్భం బయి తనరుచుండ
శ్రుతు లన్నియును ముఖోద్గతము లై విలసిల్ల
నలసరస్వతి పత్ని యై చెలంగ
నారదసనకసనందనప్రముఖులు
నందను లై మహానంద మొసఁగ
సకలప్రపంచైకసర్గసంచారంబు
నిత్యవిహార మై నెగడుచుండ
నున్ననీదుమహత్త్వమే నెన్నఁగలనె
యేనకాదింక నెవ్వారు నెన్న లేరు
బ్రహ్మ బ్రహ్మస్వరూప హిరణ్యగర్భ
వనజసంభవ నీ కిదె వందనంబు. ౧౩౨

క. మునులును దైవతవరులు
న్నినుఁ గానఁగ నేర రట్టినీవు కరుణచే
నను బహుమానము చేయఁగఁ
జనుదెంచితి నేను బుణ్యశాలిఁ దలంపన్. ౧౩౩

క. అనిన విని బ్రహ్మ యమ్మునిఁ
గనుఁగొని కూర్చుండు మనియెఁ గమలాసనుశా
సనమున నాతఁడు నుచితా
సనమునఁ గూర్చుండె సంతసం బెసఁగంగన్. ౧౩౪

వ. కొంతతడవు గూర్చుండి వాల్మీకి యంత నంతరంగంబున శబరశరవిద్ధ
శకుంత సంతాపావలోకన వ్యాకులత్వంబు వొడమం బొక్కి పడుచు
నిమీలితలోచనుం డగుచు బోయం జూచి తా నాడినమాటలు
మాటికిం దలంచుచుండ నరవిందభవుం డతనిం గనుంగొని నగుచు
నోమునికులోత్తంస నీవు శోకంబునం బలికిన పలుకు శ్లోకం బై నిలిచె
మచ్ఛందంబున స్వచ్ఛందంబుగా ఛందోమయసరస్వతి నీయందుఁ
బ్రవర్తించె నేతాదృశశ్లోకంబుల లోకంబులు వొగడ రామాయ
ణంబు నారదోక్తప్రకారంబునఁ గావ్యంబు సేయుము రామచరితంబు
సకలంబును నీకుఁ గరతలామలకంబుగాఁ గానిపించు నీవు చెప్పిన
రామాయణంబును ధరణీతలంబున నాచంద్రతారార్కంబై ప్రవర్తిల్లు
నని యుపదేశించి జలజాసనుండు నిజనివాసంబున కరిగె నంత వాల్మీకి
యు ధ్యానస్తిమితనేత్రుం డగుచు రామచరిత్రంబు సర్వంబును హృద
యంబునఁ బ్రత్యక్షంబుగా నీక్షించి నారదోక్తప్రకారంబునఁ జెప్పం
గడంగెఁ దత్కథాసంవిధానం బెట్టి దనిన. ౧౩౫

ఉ. వాంఛితదానకల్పనగ, వాసవసన్నుత, కేకిపింఛతా
పింఛనిభప్రభాంచిత, విభీషణపోషణ, భీషణాశుగ
ప్రోంఛితమత్తశాత్రవ, నభోమణివంశమణీ, ధనుర్లతా
లాంఛితపాదపద్మ శుభలక్షణ, భక్తజనైకరక్షణా. ౧౩౬

క. అర్ధేందుధర ధరేంద్ర
స్వర్ధేనుస్ఫూర్తికీర్తివైభవబద్ధ

స్ఫూర్తేంద్రవైరిహర సుర
మూర్ధేందూస్తకుటఘటితముగ్ధాంఘ్రియుగా. ౧౩౭

కవిరాజవిరాజితము.

జలనిధిలంఘనజాంఘికవానరసంఘముఖాచలశంఖవిశృం
ఖలఘనఘోషితబాహుబలయా దశకంఠవిఖండనచండశరా
బలమథనప్రముఖాఖిలదైవతపాటలరత్నకిరీటతటో
జ్జ్వలపదపద్మ సహస్రకరాన్వయవార్ధికళానిధి దాశరథీ. ౧౩౮

గద్యము. ఇది శ్రీరామచంద్ర సాంద్రకరుణాకటాక్షలబ్ధ సిద్ధసారస్వతవిశేషనిరర్గళవాగ్వైభవా శేషసరససాహిత్యకళాభోజ, సత్యసంభూషితముఖాంభోజ, సకలసామ్రాజ్యధౌరేయ, నిత్యవితీర్ణిధారాధేయ, నిరతావారితాన్నసత్రసంతోషితపంచాశత్సహస్రభూసుర, బహువారావర్తితమహాదానవైభవానర్తితకీర్తిభాసుర, నిజనామాంకితాకలంకవస్తుసమగ్రబహుళాగ్రహారభూషితచోళధరామండల, నిఖిలభోగవిభవనిర్జితాఖండల, సాధితసముద్రాంతరద్వీప పరనృపాలసంస్తుతప్రతాప, నేపాళభూపాలస్థాపనాచార్య, కర్ణాటరాజపూజనీయధౌరంధర్య, రామసేతు శ్రీరంగ విజయరాఘవపుర కుంభఘోణాదిదివ్యస్థలప్రతిష్ఠాపిత రామభద్ర, సర్వజనసంభావిత గాంభీర్యముద్రాంకితసముద్ర, సదాశ్రితభరణదీక్షాదక్ష, దక్షిణసింహాసనాధ్యక్ష, రాజాధిరాజసన్నుతాసాధారణశౌర్య, దిగంతప్రసిద్ధతరౌదార్య, సుజ్ఞానజనక, సతతసంసేవితజనక, పోషితవిద్వద్వియూథ, భువనశోభితగుణసనాథ, బలవత్పరిపంథిగృహీత సామంతమహీకాంతవిమోచనశ్లాఘనీయ బాహుబల, మూర్తిమాంబాగర్భశుక్తిముక్తాఫల, చినచెవ్వయాచ్యుతనృపాలపుత్ర, సజ్జనస్తోత్రపాత్ర, రూపరేఖావిజితసుమసాయక, సకలధర్మసంధాయక రఘునాథనాయక ప్రణీతంబైన శ్రీమద్రామాయణంబున విబుధజనవినుత వివిధకథాశాఖాప్రకాండంబగు బాలకాండంబునందుఁ బ్రథమాశ్వాసము.

శ్రీరస్తు.

రఘునాథరామాయణము.

ద్వితీయాశ్వాసము.

క. శ్రీకంత్తిరథకుమారక
చాపకళాచార్య బాహుశౌర్యోజ్జ్వలశో
భావఃపూర్ణ ఘనాఘ
క్షేమకశుభదివ్యనామ శ్రీరఘురామా. ౧

వ. అవధరింపు మవ్వాల్మీకిమునివల్లభుం డిట్లని చెప్పందొడంగె. ౨

ఉ. శ్రీసతికి న్నివాసము ధరిత్రికి నుత్తమరత్నభూషణ
న్యాసము సారసారవ[1]ఘనాంబువిజృంభితసస్యసంపదు
ద్భాసితభూవిభాగము నుదంచితభోగము నంచు నెంచఁ గాఁ
గోసలదేశ మొప్పుఁ గలకోకిలగానవనప్రదేశమై. 3

క. ఆదేశమహిమ యెంతయు
వేదజ్ఞులకలుకు లలర వినుతింపం గా
కోదరపతి తగుసేమో
కా దితకులచేత నెన్నిగంతులు గొన్నన్. ౪

శా. వేదండంబుల హస్తకాండములకీవిం బోల్పు బల్గంటలం
బ్రోది స్నీతెకు రాజనంపువరిగుంపు ల్నిండి యెక్కాలముం
గేదారంబులఁ బండి తట్టారఁగి వీక్షింపంగ నానందమా
నాదేశంబున నేకదేశమును జేయంజాల దేదేశమున్. ౫

సీ. కీరము ల్ముక్కుల గీఱ నిల్వక జాఱు
చెలువంపు రసదాళి చెఱకుఁబాలు[2].
జెంత నంతటఁ బాఁడి చిదిసిన ముంతమా
మిడిపండ్ల రసములోఁ బడి పొరలుచు
నుఱుతలు గొఱుకంగ నొండొండఁ దొరఁగెడు
నారికెడంపుబొండ్లములనీటఁ

---

1. సారవ=సరయూనదీసంబంధి. 2. చెఱకుఁజాతి.

గలసి చేరువ యేటికాలువలను గూడి
ములఁ గాఁజపుఁజేల వలదిరుగుమఁ
దరులఁ బొదరులఁ బనువంపు విరుల వడియు
కమ్మఁదేనెలు పైఁ గ్రమ్మి కమ్మఁగాఁగ
ననుదినంబును బ్రవహించు నన్ని యెడల
నేమి చెప్పంగవచ్చు నాభూమిమహిమ. ౬

చ. చిలుకలు ముక్కునం బొడుచఁ జిల్లునఁ జిమ్ముచు గ్రోవులం బలె
న్వెలువడు నిక్షుకాండరసనిర్ఝరముల్ నికటస్థపల్వలం
బులఁ బసి యొండ కాఁకలను బొంగు మఁ జిక్కణపాక మైన రా
జిలుతమిఁ ద్రొక్కి చక్కెరలు సేయుదు రక్కడి హాలికోత్తముల్. ౭

మ. సరయూతీరమహాగ్రహారముల నశ్రాంతంబు సంతుష్టభూ
సురయజ్ఞశ్రుతిఘోషపోషితములై శోభిల్లుఁ దత్ప్రాంతభూ
సరసీజాకరమాకరందరసనిష్యందప్రహృష్యత్తరా
గరిరంసాపరహంససారసవతీసంఘక్రేంకృతిక్రియాఘుంకృతుల్. ౮

క. ఎక్కడఁ జూచిన శుభనదు
లెక్కడఁ గనుఁగొన్న నిధులు నెక్కడఁ గన్నం
జొక్కపుఁగనులు న్నెలకొను
నక్కోసలదేశమహిమ యలవియె పొగడన్. ౯

సీ. పల్లెలు చూడ భాసిల్లు నచ్చట మహా
గ్రామము ల్వలె నభిరామలీల
గ్రామము ల్గనుఁగొన్నఁ గనుసమృద్ధి చెలంగఁ
బట్టణంబులు వోలెఁ బరిఢవిల్లుఁ
బట్టణంబులు గన్న బహువైభవంబుల
దేశంబులును బోలెఁ దేజరిల్లు
దేశ మంతయును శోధించి కాంచ నఖండ
భూమండలము వోలెఁ బొలుపు మిగులు
నమరగురుఁ డైన నక్కోసలములమహిమ
యరసి వర్ణింపఁగలఁడె బ్రహ్మాండగోళ

మునఁ గలుగుధాత్రి యంతయు నొనరి యొక్క
చక్కి నిలిచినయటు లుండు నిక్కముగను. ౧౦

సీ. పుష్పమంజరు లిప్పపువ్వరాజనములు
కస్తూరినిగరాలు గంధసరులు
గంగాజలంబులు బంగారు తీఁగియ
లేనుఁగుదంతముల్ దీవసరులు
సన్నవంకెలు ముత్తెసరులు ప్రాసంగులు
రాయమెచ్చులు నీశ్వరప్రియములు
నయములు రామబాణములు సీతాభోగ
ములుఁ బాలకేసరుల్ మోసనములు
కఱియమేనులు సన్నబక్కండ్లు మఱియుఁ
గలుగు ధాన్యంబులెల్ల ముక్కాఱుఁ బండి
నిండి యెల్లెడఁ జూచిన నెగడుచుండు
క్షామ మనుపేరు నెఱుఁగ రాభూమిప్రజలు. ౧౧

క. కరములఁ జిలుకలు వ్రాలఁగ
శిరమున రాజనపు టెన్ను చెఱివి నవసుధా
కరకళఁ దగుపార్వతు లనఁ
బరఁగుదు రాప్రోలి శాలిపాలిక లెపుడున్ ౧౨

ఉ. కప్పురభోగివంటకముఁ గమ్మని నేవడియ న్భుజించి మే
లుద్దపుటులట్లు మూరగల తోరపుఁబచ్చడము ల్బెలంగఁగా
గొప్పకడానిపైఁడి జిగిగుత్తపు టుంగరము ల్కరంబులం
ద్రిప్పుచు రచ్చ సేయుదురు రెడ్డివార ల్తమి హెచ్చ నచ్చటన్. ౧౩

వ. మఱియు సరయూసరిత్ప్రవాహనివహాలంకృతసదేశం బగు నక్కోసల
దేశంబు ధర్మం బాతట నెలకొన నెలనెల దప్పకుండఁ గుండలం గుమ్మ
రించినట్లు గురియువర్షంబులచేత హర్షంబునం బలె నుప్పొంగి నదీతరం
గంబు లెల్లెడ వెల్లివిరియ నొండొండ మెండుకొని పండు లిరవుకొన
నెరువుచల్లినబాగున వీరభోగంబు లగు భూమిభాగంబులం గనుం
గొనం జాలి శాలి యవ గోధూమాది ధాన్యంబు లెప్పుడుం దెప్ప

లుగాఁ బండు నుదార కేదారంబులకు నాధారంబు లగుచెఱువుల దొరువులం గనుపట్టుచు బంగారు వెట్టిన మొలచు జాంగలభూములం జెంగలించు నుత్తుంగ నారికేళతరు సంఘంబులవలన నక్కడక్కడం జిక్రోడదంష్ట్రాటంకదష్టంబు లై తోటతోటనం బహు ఫలదట్టంబులు జలదేవతలు వేడుకలు పుట్టం బుట్టచెండులు గోర్చువిధంబున మాటి మాటికిని నీటిమీఁదటం బుట మెగయం దటరుహతరుభ్రంశికుసుమ వాసనలు ముంచికొనం బ్రవహించు కట్టుఁగాలువలచెంగట నందంద కుంద ప్రసూనబృందకందళన్మకరందపానసంభ్రమబంభ్రమ్యమాణబం భరడింభఝంకారంబులతోడఁ గూడి యిక్షుయంత్రక్రేంకారంబులు సవిధకాసారసారసక్రేంకారంబులం గర్ణోత్సవంబులు నెఱప నెఱప సిండి మిసిమిజిగి నీను మేచుల పసం బొసంగు పసిగాఁపుగుబ్బెత లుబ్బుచెలంగ సలిలపూర్ణస్వర్ణకలశంబులు బింకంపుఁజన్నుల నొఱ యం జంకల నిడికొని నడయామతీవ్రులం బాటిల్లు నీరాటిరేవులం జూపఱకు నుల్లంఠగోలుపగ్రామోపకంఠంబుల విలసిల్లు తిల్య మాష్య భాంగీన మౌద్గీన కౌద్రవీణాదిక్షేత్రంబుల గనిమలం బొదలు చు నుమ్మగోలుపులేఁతపచ్చికలు మేసి యాము గ్రసి మిసమిసని మే నుల శోభిల్లుచు నాభీరకుమారవదననాదితవంశనాళవివర వివిధభంగి తరంగితాలాపలీలాపరంపరాకర్ణనంబుల నానందించు నాలమందల యమందలలితహంభారవవిజృంభణంబుల ఘూర్ణమానంబు లగునదీ మాతృకగ్రామంబుల సమగ్రం బై యగ్రమండపాంతరనిరంతర నటన్నటీచటుల పదకంజమంజుమణిమంజీరఝణంఝణస్వానానుకా రిమనోహారి మంగళమృదంగసంఘధింధిమిధ్వనిబంధురంబు లగు దేవా లయంబుల నందం బై సకలజనానందం బై విలసిల్లు చుండు. ౧౮

క. అక్కోసలంబులందుల
నొక్క పురము చూడఁదగు నయోధ్య యనఁగ నా
చక్కఁదనము వర్ణింపఁగ
నిక్కముగాఁ గమలభవుఁడు నేరఁడు దలఁపన్. ౧౯

క. శ్రీవటనరంగశాల మ
హానృపగణరత్నపేటి యనుచు జనంబుల్
వేనోళ్లం బొగడ నయో
ధ్యానగరము వెలయు లోచనానందం బై. ౧౭

వ. మనునిర్మితం బగు నయోధ్యానగరంబు యోజనత్రయవిస్తారంబును ద్వాదశయోజనాయామంబునుం గలిగి రెండు యోజనంబుల మేర సత్యనామం బై యరిభీమం బై సకలజనాభిరామం బై విలసిల్లుచుండు.

క. దివినుండి భువికి డిగ్గరు
భువినుండియు దివికి నేఁగఁబోలు భుజగరా
డ్భువనంబునుండి...
భువికిఁ దివికి నేఁగ నవఁగఁ బుడుకోట దగుఁ॥. ౧౮

క. అన్నగరికోట తుదమొన
లెన్నఁగ సురపన్నగేశు లెఱుఁగుదు రేమో
యిన్నర కలికితిఁ గా కవి
యెన్నఁగ... ... ... ౧౯

గీ. ఆనగరికోట మలఁచిన మానికంబు
లంశుజాలాతపంబుచే నలరఁజేసి
యగడితలలోని పద్మంబు లందు రాగ
మునుపఁగాఁ (బద్మరాగంబు లనుచుఁ) బరఁగె. ౨౦

క. పులిమొగము లనం గోటల
యులిమొగములు మెఱయుచుండు నుగ్రపుఁగోటల్
వలె నుక్కు వసులు పెక్కులు
పలుచిక్కులు వీరాఱ... ... ...గ॥. ౨౧

క. సురవాహిని బహుముఖములఁ
బరిఖాంబుధి దుముకులీలఁ బరఁగుం బురగో
పురహీరకాంతిధోరణి
నిరతము నామూ... ... ...॥. ౨౨

విద్రిచె నక్షుని దిక్కు లద్రువ వాయుజుఁ డన
భావింప సమలఘుప్రాస మయ్యె
బిందుపూర్వంబుగాఁ బొందిన బములు జ
గంబులోఁ గృతులను గ్రమ్ము ననఁగ
శమదమసంపన్నుఁ డమృతాశి యని ఋయు
తాయుతంబుల ప్రాస మంటుటయును
లశ లవి యొండొంటిఁ గలయఁగఁ గూర్చుట
పాటింప నిట్టిదె ప్రాసమైత్రి
పాదలు రాఘవదాస కదనజయోల్లాస
కదియు సంత్యప్రాస మిది సువాస
దోఃఖండితాసుర దుఃఖనాశా యను
పట్టున దుష్కరప్రాస మయ్యె
శ్రీరామపాదసేవారామ యనుచును
రచియింప ద్వంద్వమ ప్ప్రాస మగును
జనకజాశోకనాశన కజాతా యని
పల్కుచో నిదియె త్రిప్రాస మరయ
వినయశోభనమూర్తి ఘనయశోభూషణ
భరియింపు మనఁ జతుప్ప్రాస మయ్యె
అప్రతీకప్రతాపప్రభాప్రకర య
నుప్రాస మగు నిది సుప్రసిద్ధ
యిట్టి యష్టాదశప్రాసపృథులభేద
మెఱిఁగి పూర్వులు చెప్పినకృతులయందు
లక్ష్యము ల్పెక్కు లీక్షించి లాక్షణికులు
కృతులఁ బ్రాసంబు లునుతు కోకీశనాథ. ౬౫

వ. మఱియు యతిభేదలక్షణంబులు వివరించెద. ౬౬

క. వడి యగుఁ బాదాదులయం
దిడునక్షర మేది యదియె యెనచేసుక యె

వ్యెడ యతి రావలె నని రట
నిడుటయు విరతులకు సంజ్ఞ యినసుతమంత్రీ. ౬౭

— యతులు —

సీ. స్వర విభాగ ప్రాది వర్గ నిత్యాదేశ
సరస మా వృ ద్ధ్యనుస్వర వికల్ప
భిన్న కాకుస్వరా భే దోభ యాఖండ
ఋ ప్రభు దేశీయ రి ప్లుత జ్ఞ
యుత శకంధుగణాఖ్యయతులును మఱి చక్క
టియు నెక్కటియుఁ బోలికయును గూడి
సప్తవింశతి యతు లన్కత్రవు లనిగొన్న
కరణి వల్లన్నియుఁ గానరాఁగ
గీతి తారావళిగఁ జేతుఁ గృతుల లాక్ష
ణికులు మెచ్చంగ నీకు నే నేర్పు మెఱసి
జానకీనాథపదభక్తజనవిధేయ
భంజితాసురసముదాయ యాంజనేయ. ౬౮

గీ. ప్రాక్యభయనిత్య కాకుస్వరములు గాక
యన్యపదములపై స్వర మందెనేని
అదియె స్వరయతి యగును శూరాఢ్య యనఁగ
భంజితాసురసముదాయ యాంజనేయ. ౧

గీ. సంఖ్యయంను బరిమాణసంజ్ఞ సంఘ
టిల విభాగాఖ్యయతులు రెండేసి యగుఁ గ
పీశ్వరుల కర్థమిా గంపెఁడేసి యనఁగ
భంజితాసురసముదాయ యాంజనేయ. ౨

గీ. ప్రాక లిరువదిలోఁ బరాజపులు దక్క
నన్నియుపసర్గలు స్వరసమన్వితముగఁ
బ్రాది యతియగుఁ గీర్తివైభవుఁడ యనిన
భంజితాసురసముదాయ యాంజనేయ. 3

గీ. కచటతపలపై వర్ణము ల్లదల నుంచి
కడమ వేర్వేఱ నాల్గేసి కలయ నిడినఁ
గాఖ్య లది వర్గవడి యండ్రు ఘనవితరణ
భంజితాసురసముదాయ యాంజనేయ. ౪

గీ. పదము లేర్పాటుగాఁ జేయ బాగుగాని
సంధి నిత్యసమాసవిశ్రమము దనరు
సవ్యసద్గుణరత్నరత్నాకర యన
భంజితాసురసముదాయ యాంజనేయ. ౫

గీ. ద్వీపనాకశబ్దముల నాదేశవిరతి
యగును గవిజనబుధలోకనాకవృక్ష
యెంతరమ్యంబు జాంబవద్వీప మనిన
భంజితాసురసముదాయ యాంజనేయ. ౬

గీ. శషసలకు చఛజఝు చతుష్కము వడియిడ
నయహ లొండొంటితో మత యతు లమర్ప
సరసయతి యందు రవి కవిజనము లెల్ల
భంజితాసురసముదాయ యాంజనేయ. ౭

గీ. యహలపిఱుఁద ననుస్వారసహిత మైన
మాకు వడి యగు దేవసంయమినుతుండు
మాకు సిరులిచ్చు దైవసింహం బనంగ
భంజితాసురసముదాయ యాంజనేయ. ౮

గీ. ఏక మోజంబు మొదలుగా నెసఁగుసంధి
వృద్ధియతు లగు దేవలోకైకమాన్య
యున్నతాహితశైలబిడౌజ యనిన
భంజితాసురసముదాయ యాంజనేయ. ౯

గీ. నణమలకు బిందుఁయుతు లిటుండంగవలయు
నరవరస్తుతకావ్యసందర్భములను
మహితరణరంగశౌర్యసంపన్న వినుము
భంజితాసురసముదాయ యాంజనేయ. ౧౦

గీ. సంధులను రెంకురూపము లరగువర్ణ
మున వికల్పాక్షరయతులు దనరుఁ గృతులఁ
దలఁపు రాముపై నిడినసన్మతివి యనిన
భంజితాసురసముదాయ దయాంజనేయ. ౧౧

గీ. ప్రేమచే నీవు మమ్ము భరింతు వనిన
జగణమధ్యంబు భిన్నవిక్రమము దనరు
పీన నిత్యంబు విరళమై పూనుఁ గనుక
భంజితాసురసముదాయ దయాంజనేయ. ౧౨

గీ. అమరఁ బ్రశ్నాకలితదీర్ఘమైన యొక వ
డి యగుఁ గాకుస్వరమున నీఁడే ఘనుఁ డితఁ
డే చుమీ కీర్తినిధి యని యెంతు రనిన
భంజితాసురసముదాయ దయాంజనేయ. ౧౩

గీ. పృథివి సుకవులు 'వపరయోరభేద' యనెడి
పలుకుచేఁ బఫబభ లవి వాకుఁ గృతుల
విరతు లున్నను రవిగా యభేదయతులు
భంజితాసురసముదాయ దయాంజనేయ. ౧౪

గీ. జగతి యుష్మదస్మచ్ఛబ్దముగళమున నె
తగు నుభయరూపయతి యస్మదలఘుసుకృతి
యవని వెలయుట యది యుష్మదతిశయ మన
భంజితాసురసముదాయ దయాంజనేయ. ౧౫

గీ. ఒక్క వర్ణంబు స్వరమూఁద నొకట స్వరము
గలయకుండఁగఁ గూర్తు రఖండయతులు
రామపదపద్మలోలవరాళి యనుచు
భంజితాసురసముదాయ దయాంజనేయ. ౧౬

గీ. బువడి పోలుపొందు వేర్వేఱఁ గృతులయందు
హేమగిరిధీర రక్షితకృపణవార
యుద్ధచాత్రి కరుణాసమృద్ధ యనిన
భంజితాసురసముదాయ దయాంజనేయ. ౧౭

గీ. అయ్యె యమ్మనుచోఁ దేలినట్టిసంధి
యగును బ్రభునామయతి హనుమయకుఁ గన్న
తల్లి యైనది యాపార్వతమ్మ యనఁగ
భంజితాసురసముదాయ యాంజనేయ. ౧౮

*గీ. అచ్చుతోఁగూడి దేశీయ మనెడు విరతి
యెన్న నొక్కొకచోటఁ గ్రిక్కిరియుఁ గృతుల
సరసలక్షణకవులు గ్రచ్చర సమర్ప
భంజితాసురసముదాయ యాంజనేయ. ౧౯

గీ. కృతులఋత్వంబుతోఁ ఋత రియచువడియుఁ
బృథివిపై మించు దండితరిపుసమూహ
పృథులతరకీర్తి రణజయశ్రీ యటన్న
భంజితాసురసముదాయ యాంజనేయ. ౨౦

గీ. సంశయాహ్వనగీతార్థసరణి దగును
నొదవు ప్లుతయతి యగునో కాదో యటంచు
ననినయెడ దీర్ఘమున మహాత్మా యటనిన
భంజితాసురసముదాయ యాంజనేయ. ౨౧

గీ. జ్ఞాకుఁ దెలుఁగుతద్భవ మైన నా దలిచ్చు
డానఁ జేసి వడి జ్ఞాకుఁ దగు నిడఁగ
నవయశోజితచంద్ర ప్రజ్ఞాఫణీంద్ర
భంజితాసురసముదాయ యాంజనేయ. ౨౨

గీ. ఒకటిరెంటును గలసి సంయుక్త మైన
నందు నొక యక్షరమునకు యతి సమర్ప
సంయుతాక్షరయతి యండ్రు త్మాఘరహిత
భంజితాసురసముదాయ యాంజనేయ. ౨౩

గీ. అల శకంధ్వాదిగణమున కచ్చు హల్లు
యతు లొనర్తురు సుకవి వేదండరచిత

---

*అచ్చు హల్లును దేశీయమనియెడివడి...గ్రిక్కిరియెఁ గృతుల- గి. రా. వావిళ్ల వారి అప్పకవీయము.

నిఖిలకృతులను జూచి మనీషివినుత
భంజితాసురసముదాయ యాంజనేయ. ౨౬

గీ. పుఫుబుభులు ముకారంబుతోఁ బొల్పమీఱ
మొనయఁ జక్కటియతి యండ్రు పూర్వకవులు
బుధనుతాంచితకీర్తి సన్మూర్తి యనఁగ
భంజితాసురసముదాయ యాంజనేయ. ౨౭

*గీ. మహిమ నెక్కటియతులయ్యె మరవజలలు
రహిని దమతమకయ వల్లు రమ్యచరిత
వనధిగంభీర సద్గుణావాస యనఁగ
భంజితాసురసముదాయ యాంజనేయ. ౨౮

గీ. దొరయఁ బుఫుబుభులు విభక్తితుదలఁ గలము
వర్ణమునఁ బోల్చి యతు లనవచ్చుఁ గృతులఁ
బుణ్యమూర్తివి భూలోకమున నటన్న
భంజితాసురసముదాయ యాంజనేయ. ౨౯

— వృత్తక్రమము —

క. నరగణసంజ్ఞలు దీర్ఘా
క్షర మున్నను గణము రెండుగను సంయుక్తా
క్షర మున్న గణము లెడలిచి
వరుసన యుక్తవలయుఁ దెలిసి వనచరచంద్రా. ౬౯

గీ. పంక్తి మొదలుగాఁగఁ బదునేడుఛందంబు
లందు వృత్తములను యతు లమర్చ
వలయుఁ గాన నెచట వడి యుండఁ బూన్చితి
నచట వళులు నిలుపనగు హరీంద్ర. ౭౦

గీ. అమర నుక్తాదిగా నిర్వదాఱుఛంద
ములను గల్గిన వృత్తసంఖ్యలఁ బ్రసిద్ధ

*మహిమ నెక్కటియతులన మరవజలలు । రహిని దమతమకయ మగు- గీ. రా, వావిళ్లవారి అచ్చుప్రతియందు.

మైనవృత్తంబు లొక్కొక యంఘ్రి గూర్చ
హనుమ లక్షణలక్ష్యంబు అగును వినుమ. ౭౧

— ఉక్తాదిచ్ఛందములు —

క. మొదలిటి 'యుక్త'ను దెలియఁగ
నుదయించిన యట్టివృత్తయుగమున 'శ్రీ'కిం
బదమున కొక్కొకగురువై
కదియునయా యాంజనేయ కవిజనగేయా. ౭౨

౧. ఉక్తాఛందంబున 'శ్రీ'యనువృత్తము- గ U.*

క. నాలుగువృత్తము 'లత్యు
క్తా'లలితము లందులోనఁ గల 'స్త్రీ పెంపుం'
జాలఁ బ్రసిద్ధిగ నెంతురు
పాలితనతజనసమాజ పవనతనూజా. ౭౩

౨. గా 'స్త్రీ' U U. ఈ స్త్రీపెంపనువృత్తమే 'స్త్రీవృత్తము'.

క. ఎనిమిదివృత్తంబులు 'మ
ధ్యను' గలిగెను వానియందుఁ దనరుచు "నాకీ,
వినయ, మృగుల్" మసరల నగు
ననఘా క్రమయుక్తిఁ జేసి యనిలకుమారా. ౭౪

3. నాకీవృత్తము, మ U U U; వినయవృత్తము, స I I U; మృగీవృత్తము, ర U I U.

క. తెలియఁగ నాల్గవయది యై
వెలయు 'ప్రతిష్ఠ' ను బదాఱువృత్తంబులలోఁ
బొలుపై "బింబాదులు" నా
ల్గలరుచు సుగ్రీవమిత్ర యంచితగాత్రా. ౭౫

౪. 'బింబ', భగల్-భ U I I, గ U; 'కన్యా' గాగాగా-గా, UU, గా UU; యగల్ 'ప్రీతి'-య I U U, గ U; 'సుకాంతి' జగల్-జ I U I, గ U.

క. ఒప్పైన 'సుప్రతిష్ఠ'ను
ముప్పదియును రెండువృత్తములలోఁ దగునా

*U ఇది గురుసంజ్ఞ । I ఇది లఘుసంజ్ఞ.

అప్పంక్తి మొదలుగా నవి
చెప్పెద శ్రీరామదాససేవామోదా. ౭౬

౫. 'పంక్తి'భమ్ముగగ్గా-భ U I I, గా U U; దీనిపేరే సుందరీవృత్తము.
రంబుగాల్ 'ప్రీతిన్'-ర U I U, గా U U;
'సతిన్' జగాలా-జ I U I, గా U U;
'నందం'దలగల్-త U U I, లగ I U;
'ప్రగుణన్' సల్గాల్-స I I U, గా U U;
'అంబుజము' భవల్ భ U I I, వ I U.

క. విను గాయత్రీఛందం
బున నఱువదినాల్గువృత్తములు గల వందుం
దనుమధ్యాదు లవెన్మిది
దనరును గృతులందు గిళితతామరసాక్షా. ౭౭

౬. త్యాప్తిం'దనుమధ్యన్' త U U I, య I U U;
'వసుధన్' ససలా-స I I U, స I I U;
'శశివదన' న్యల్-న I I I, య I U U;
'చంద్రవదనన్' భ్యల్-భ U I I, య I U U;
మగ్గంబు'ల్సావిత్రిన్'(ఆఱుగురువులు)-మ U U U, మ U U U;
త్సాప్తి'స్వసుమతీ'-త U U I, స I I U;
యయంబుల్'విచిత్రన్' య I U U, య I U U;
'సురలత'కు న్యల్-న I I I, య I U U.

క. అల 'యుష్ణి'క్ఛందంబున
నెలమింగల నూటయిర్వదెన్మిదివృత్త
మ్ములలో మదరేఖాదులు
పొలుపగు మునిసంఖ్య వెలయు భూమిజాశహితా. ౭౮

౭. †మస్గంబుల్ 'మదరేఖన్'- మ U U U, స I I U, గ U;
'మధుమతిన్'నభగల్-న I I I, భ U I I, గ U;
రజ్గము 'ల్విభూతి'కిన్-ర U I U, జ I U I, గ U;

†సల్గంబుల్ -అనిమూలము.

(29) "వంకాయను జెఱకురసము వడియుచునుండెన్."

క. పంకజముఖపై నామక
రాంకున కేసుట్టికినుకొ యాశుగముల ని
శ్శంకముగఁ జేఁద నప్పుడు
వంకాయను జెఱకు రసము వడియుచు నుండెన్.

వంకాయను, వంక + ఆయెను. వంకరగాఁబోయెను. ఇక్షుధనుస్సు గనుక- అచెఱకున రసముపడినను. పద్యములో వంకాయెను, అనియున్నది. వంక + ఆయెను- అనునది సరియే కాని వంకాయె- అనివంగకాయకురూపముకో ధనీయము. వ్యవహారములోనిధ్వనిని బట్టియే.

(30) "కలికిని గనుఁగొంటి డేగకాల న్మింటన్."

క. పొలమున నారణపక్షిన్
బలిమిని దాఁప యని తూటి బహువేగముచం
దలపట్టి యీడ్చునప్పుడు
కలికిని కనుఁగొంటి డేగకాల న్మింటన్.

కలికిన్=స్త్రీని. మింటఁగంటిని- విపరీతము. నారణపక్షికలికిన్=నారాయణపక్షి శిరమునందుండు, (తురాయి) యీఁకను. డేగ పట్టి యీడ్వఁగా దానికాలిని బట్టె నని- కలికితురాయి.

(31) "రతిపతి మన్మథుఁడు గాఁడు బ్రహ్మయె తలఁపన్."

క. సతతము వీణావాదన
చతురతఁ దన రత్నసభను జలరూపం బౌ
వితమునను జేయు నాథా
రతిపతి మన్మథుఁడు గాఁడు బ్రహ్మయె తలఁపన్.

(32) "బీరకాయకన్ను చేరెఁడంత."

గీ. వినను గనను లేదు విశ్వంబులో వింత
గంటి నేను జాలఁ గన్నులార
నీవుఁ జూడరమ్ము నిక్కంబు కనకజం
బీరకాయ కన్ను చేరెఁడంత.

కనక, జంబీర, కాయ=బంగారు, నిమ్మపండువంటి, శరీరము, గల స్త్రీ యొక్క కన్ను=నేత్రము- చేరెఁడంత.

(33) "రతనమునకు గుఱుతు దంతిరథ ఘోటకముల్."

క. సతతము సరసామాత్యుల
మతివిభవము గూడ రాష్ట్ర వర్ధన మెపుడుం
గుతుకమ్మునఁ జేయు నలదో
రతనమునకు గుఱుతు దంతి రథ ఘోటకముల్.

(34) "అమ్మనన్నను నవల సయ్యాట గలదె."

గీ. నిమ్మపం డమ్ముచును నొక్క నెలఁత రాఁగ
గొప్పవిగ రెండుపండ్లు గైకొందు ననఁగ
నేల పలుమాట లాడెద విటుల విటుల
కమ్మనన్నను నవల సయ్యాటగలదె.

అమ్మను=నిమ్మపండ్లువిక్రయింపను, అమ్మను=తల్లిని. పండ్లమ్మనవిన పిమ్మటవదు గుఱుతేల. అమ్మను- అని వారి తెల్పినప్పుడు విటులసయ్యాటము లుండునా.

(35) "బోడికిఁ గొప్పంచ మిగుల ముద్దులు గులికెన్."

క. ఏడను వినికియుఁ గలదే
బోడికిఁగొప్పంచు పలుకు భువనస్థలిలోఁ
గోడెమిటారికి నాపూఁ
బోఁడికిఁ గొప్పంచ మిగుల ముద్దులు గులికెన్.

పూఁబోడికిన్=పువ్వుసదృశశరీరముగల స్త్రీకి.

(36) "పలుకులనే చెప్పఁకతనఁ బలుకులె యయ్యెన్."

క. పులకండము లంచని తే
నెలటం చని పలుకుచుంద్రు నేరనివారల్
కలికికిఁ బలుకులు కపురపుఁ
బలుకులనే చెప్పఁకతనఁ బలుకులె యయ్యెన్.

(37) "గ్రామమ్మున కొసఁగె శివుఁడు కంజాక్షునకున్."

క. తామరలు వేయి పూజకు
నేమంబున నొకటి దఱుగ నేత్రం బిడినం
బ్రేమం జక్రమ్మును సం
గ్రామమ్మున కొసఁగె శివుఁడు కంజాక్షునకున్.

గ్రామము- విషయము, సంగ్రామము=యుద్ధము- సమాధానము.

(38) "తెఱమఱుఁగే చాలు వేఱ తెరమఱుఁగేలా."

క. తెఱవా నీయధరమునే
నిరతము నాశించి యుంద నీవును జేరఁగ
మఱుఁగిడి తడిసరియా వా
తెఱమఱుఁగే చాలు వేఱ తెరమఱుఁగేలా.

తెర=మఱుఁగుచీర. వాతెఱ=మోవి.

(39) "రంగపతే తురక గాక రఁగప తౌనా."

క. అంగనఁ గొని వానింటను
బొంగలి నదివెట్టఁ దినిమోఁ బో యది యెగ్గా
గంగాధర యేమందుఁ దు
రంగపతే తురక కాక రంగపతౌనా.

తురంగపతి=అశ్వపతి- పాచ్ఛాకొర. రంగపతి=శ్రీరంగనాయకులు.

(40) "హారంబులు లేక యమరు లౌ టరుదే కా."

క. ధీరతను దెంపుచేసుక
ఘోరాహవభూమిలోనఁ గూలిన మేలౌ
శూరగణ మప్పు డమృతా
హారంబులు లేక యమరు లౌటరుదే కా.

హారములు=ఆహారములు లేకయే. అమరులు=చావనివారైరనుటవిషమము. అప్పు డాహారములేకయే, యుద్ధమునం దీల్గిన శూరు లమరులై రని సమాధానము.

(41) "గాలికి సదృశములు యువతికఠినకుచంబుల్."

క. వ లుఁగసమములు కన్నులు
కాలాహికి సాటి వేణి కాముని విల్లా
భ్రూలత లన్నట్లగును న
గాలికి సదృశములు యువతికఠినకుచంబుల్.

నగ + ఆలికి=నగాలికి, కొండలగుంపునకు.

(42) "ధీరుఁడు రణ మన్న వెఱచుఁ దొంపరిగామిన్."

క. సూరునిఁ గన్న దివాంధము
బైరినిఁ గనుఁగొన్న కొంగ పంచాననముం

జేరినమృగ మన్నట్లు య
ధీరుఁడు రణమున్న వెఱవఁ దెంపరిగామిన్.

(43) "రామునిసతి గుణము శబ్దరాశిం గొలిపెన్."

క. భూమీశునెదుర వారల
పై మందును గుండ్లునుం దుపాకిని నిడి తా
వేమఱు బాదరు నుంచిన
రాముని సతిగుణము శబ్దరాశిం గొలిపెన్.

రాముని సతి యగుసీతగుణము శబ్దరాశిం గల్పించుట- విషయము.

రామునిసతి=జానకి; గుణము=త్రాడు. జానకిత్రాడు, పూర్వము కర్ణాటకప్రభుపాలలకు జానకిత్రాళ్లచివర నగ్ని ముట్టించియుంచి, బాదరు, అనఁగాఁ దుపాకియందు, పోసిన తుపాకి చెవికిఁ దగిలించిన నది శబ్దముచేసెడిది, అరచెట్టునార మొదలగు కొన్నివారలతోఁ త్రాళ్లు పేని నిప్పంటించిన నది యారిపోకుండ రగులును. రంజకమంటుకొనిన శబ్దించును. రామునిసతిగుణము=జానకిత్రాడని కల్పింపఁబడినది. లక్షితలక్షణముగా గ్రహింపనగును.

(44) "మీసానకుఁ గాళ్లు మూఁడు మేదినిఁ గల్గెన్."

క. మీసానకుఁ గాళ్లెక్కడ
వాసిగ విన్నదియు లేదు వసుధాస్థలిలో
వాసనగంధము రాచెడు
మీసానకుఁ గాళ్లు మూఁడు మేదినిఁ గల్గెన్.

మీసానకు=మీసమునకు- మీసానకు=మీగంధపుసానకు-

(45) "పులి దాసరులకును బెట్టెఁ బొట్టలు నిండన్."

క. పులి మెకురఁ బడినచోఁ దిరు
మలరాయని వేఁడుకొనఁగ మనసున నొకఁడా
వలఁ దొలఁగిపోయె శాంతతఁ
బులి దాసరులకును బెట్టెఁ బొట్టలునిండన్.

పులి హింసచేయక తొలఁగిపోయినది. అతఁడు పిదప వేఁడుకోలుచొప్పున దాసులకు భోజనము పెట్టెను.

(46) "వాలంబులు రెండు నింకుబ్రాతునకున్."

క. కేలను గేడెము పీఁపున
మేలా తరకసము బాహు పేటి న్వలచే

బాలావధులలోఁ గర
వాలంబులు రెండు నిండు బంట్రౌతునకున్.

(47) "విధవా నీ మగఁడు నిండువేకటి గదవే."

క. విధుశేఖరుసతి యాజ్ఞను
మధురాధర యైనఁ గూడె మారుని కేళిన్
బుధుఁ డేమి చెప్ప గృహాదట
విధవా నీమగఁడు నిండువేకటి గదవే.

విధవా నీ మగఁడు=అనునది విషయము.

గృహాదటవిధవా=గృహాత్=ఇల్లుగాఁజేసికొనిన, అటవి=అడవిగలవాఁడే, ధవా=పెనిమిటిగాఁగల యోషవితా=నీమగఁడు పరిపూర్ణగర్భమును దాల్చె నని సమాధానము.

వైవస్వతమనువు పుత్రుం బడయఁగోరి వసిష్ఠుం బ్రార్థించి యతనియాజ్ఞచే యాగ మొనరించిన, నతనిభార్య యిష్టముచొప్పున హోత ప్రయత్నము ద్వారా. కుమారి జనించెను. మఱియు వసిష్ఠునిప్రయత్నముచే నాకుమారి కుమారుఁడయ్యెను. ఆకుమారుఁ డొక నాఁడు వేఁటకువెడలి మేరుపర్వతాగ్రస్థ కుమారవనముఁ జేరఁగాఁ బూర్వమే యొక కారణమున శివునిశాప మావనమున కేర్పడినచొప్పున స్త్రీరూపము కలిగెను. తత్సమయమున బుధుఁడు, ఆస్త్రీని గూడిన నామెకు గర్భమై పురూరవునిం గనియె నని పురాణ ప్రసిద్ధము. పురుషరూపమున నున్నపుడు ప్రద్యుమ్నుఁ డని యు, స్త్రీరూపమున నిలాకన్య యనియుఁ బేరులంగాంచెను.

(48) "పగటఁ జంద్రిక గనుపించెఁ బద్మనయన."

గీ. బాగములు సేయుదును వేడ్కఁ బలుకులాడఁ
దమ్మ రసమింతకోకపైఁ దగిలియుండ
నేమి యనఁ గొంకి తెలుసుక యుంటివవ్వ
పగటఁ జంద్రిక గనుపించెఁ బద్మనయన.

(49) "కుందేటికిఁ గొమ్ములాఱు కుక్కకువలెనే."

క. మందకడఁ దఱిమి పట్టిన
నందుల మూఁడు పసరమ్ము లదరి పొడిచినన్
ముందుబడి వెనుక దూసెను
గుందేటికిఁ గొమ్ములాఱుఁ గుక్కకువలెనే.

మందలో నొకకుక్కయును గుంటేలును జగడమాడఁగా నక్కడనున్న మూఁడు పసరములు బెదరి యారెంటిని దమకొమ్ములతోఁ బొడువఁగా మూఁడావుల యాఱు కొమ్ములును గుంటేటికిని కుక్కకును గూడ గ్రుచ్చుకొనియెనని-

(50) "చేప కొంగను మ్రింగెను జెట్టుపైని."

గీ. బలునిడివి యైన దాసరిపా మొకండు
చెట్టుమీఁదను గొమ్మను జుట్టుకొండి
దెలియకను గూఁటిపిల్లలఁ గలయ ముక్కు
చేఁప కొంగను మ్రింగెను జెట్టుపైని.

కొంగ యొకచేఁపను దనముక్కుచేత బట్టుకొని యొక్కవృక్షముమీఁదఁ గట్టి యున్న గూఁటియందుఁ గలతనపిల్లలకు నిచ్చునపుడు అవృక్షముమీఁది కొమ్మనుజుట్టి కొనియున్నపా మాచేఁపను ముక్కునందుఁ బెట్టుకొనియున్న కొంగను మ్రింగెను.

ముక్కునందుఁ జేఁపగలకొంగ ముక్కుచేఁపకొంగ.

(51) "దీపముశిఖమీఁద నీఁగ స్థిరముగ నిలిచెఁ."

క. శ్రీపతికి భక్తి ధూపము
దీపము లిచ్చెడువితాన ధీరుఁడు వ్రాసెఁ
గోపురముమీఁద వెనుకఁ
దీపము శిఖమీఁద నీఁగ స్థిరముగ నిలిచెఁ.

గోపురముమీఁద వ్రాసిన దీపపుశిఖమీఁద నీఁగ వ్రాలెనని-

(52) "కుంతికిని నంపడంబయ్యెఁ గులుకులాఁడి."

గీ. ఖడ్గితో నొక్క మాసంబు గలిసియుండెఁ
జక్రితోడను నట్లనె సరసుకొనియెఁ
బోటుకాఁడని మదినెంచి పూని యిపుడు
కుంతికిని నంపడంబయ్యెఁ గులుకులాఁడి.

ఖడ్గముగలవాఁడు ఖడ్గి- చక్రముగలవాఁడు చక్రి. అట్లే కుంతము=(బల్లెము)ను జేతఁబట్టినవాఁడు కుంతి. ఆకుంతాయుధధారితోఁ గులుకులాఁడి యిపుడుండె ననిభావము.

(53) "కడుపునఁ బెట్టుకొని ప్రోచెఁ గమలోద్భవుఁడున్."

క. మడుపులమీఁదను నాసలు
విడఁబడ వెవ్వారికైన విస్మృతమా బు

త్తడిఁకొంచెము వడి దొరకినఁ
గడుపునఁ బెట్టుకొనిప్రోచెఁ గమలోద్భవుఁడున్.

బ్రహ్మదేవునకు హిరణ్యగర్భుఁడనుపే రున్నదిగానఁ బుత్తడిని గడుపునఁబెట్టుకొని దాఁచెనని చమత్కరించెను. పుత్తడి=బంగారు.

(54) "కజ్జలధవళావతంసకమలముఁ గంటిన్."

క. గోజ్జంగనీట నొకసతి
మజ్జనమై రాఁగఁ జూపు మాటికివీనుల్
కజ్జన రాఁ దేఁటులు నిలఁ
గజ్జలధవళావతంసకమలముఁ గంటిన్.

లోచనములు కర్ణాంతాయతములై యుండఁ గుముదభ్రాంతిచేఁ దుమ్మెద లచట వ్రాలఁగాఁ జూచువారికిఁ గాటుకతోఁ గూడిన తెల్లనికర్ణభూషణమో యనునట్లుండెను. కజ్జల=కాటుకతోఁగూడిన, ధవళ=తెల్లనైన, కర్ణావతంసకమలము=విలాసమునకైఁ గర్ణమునధరించిన తెల్లకలువ.

(55) "కొల్లడమున నొక్క చేఁప కొంగను మ్రింగెన్."

క. అల్లుని హాస్యము సేయఁగ
బెల్లమునం జేసి పక్షివితతిని గొని రాఁ
ద్రుల్లికపడె నల్లగంపయుఁ
గొల్లడమున నొక్క చేఁప కొంగను మ్రింగెన్.

కొల్లడము=తిరిచినాపల్లిసమీపమునఁ గావేరినదినుండి భాగమై పాఱునొకనది. గంపలోనున్న బెల్లపుకొంగను మ్రింగెనని భావము.

(56) "పాలు త్రావకయుండియు బలిమికలిగె."

గీ. ధరణినెల్లెడ బిడ్డలు తల్లిచనుల
పాలుత్రావకయుండిన బ్రతుకు టరుదు
వింతయిది చూనో కాదో తాఁబేటిపిల్ల
పాలు త్రావక యుండియు బలిమికలిగె.

(57) "దుఱుకుగదా పంద రణము చూచినవేళన్."

క. కఱకుటతోడను యుద్ధం
బిరువాగున నడచుచుండ నేర్పడ మడియం

దిరహా దిగులునఁ బదయుం
చెఱుకుఁ గదా పంద రణము చూచినవేళన్.

పదయుంచుక్, ఉఱుకుఁగదా=పాఱిపోవునుగదా.

(58) "కిన్నెర నటువెట్టి బాల కిలకిలనవ్వెన్."

క. పున్నమచంద్రుఁడు మెఱయం
దిన్నఁగఁ దెమ్మెఱలు విసర ధీరత దప్పం
జన్ను లని కాయలంటిన
కిన్నెర నటువెట్టి బాల కిలకిలనవ్వెన్.

అంటినవాఁడు విటుఁ డని తలఁపవలయును. భ్రాంతిమంతము, ఉన్మాదసంచారిభావము.

(59) "అయ్యయ్యో ప్రౌఢ ముగ్ధయై విలసిల్లెన్."

క. తియ్యని మోవిని గ్రోలఁగ
నయ్యెడ నేమియును దెలియ కతిమోహమున
న్నెయ్యమున నేమితోఁచక
యయ్యయ్యో ప్రౌఢ ముగ్ధయై విలసిల్లెన్.

ఇందు, ప్రళయ మను సంచారిభావము.

(60) "నలుగురిమట్టునను నిలిచె నాయిల్లాలే."

క. కలువలదొర గంధర్వుఁడు
జ్వలనుఁడు నావెనుక నరుఁడు సరసీరుహనే
త్రలకుఁ బతులగుదు రౌఁగా
నలుగురిమట్టునను నిలిచె నాయిల్లాలే.

(61) "మామం దాత యని యొకనిపై సతి పడియెన్."

క. కామిని యొక్కటి వినవే
యామని స్వేదంబు నధికమై యపు డేపన్
ఏమని చెప్పుదు ససూహా
మామం దాత యని యొకనిపై సతి పడియెన్.

(ద్రౌపది) మామను- భీమునితండ్రియగు వాయువును- తాతయని- వాయువు అగ్నికిఁ దండ్రి. తాను అగ్నిలోఁ బుట్టినదికావునఁ దనకు వాయువు తాత. (స్పష్టముగా లేదు పద్యము.)